RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 113 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం,అక్టోబర్,23,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 113 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday,October,23,2025 | PAGES : 8 RS : 4 /- |




## 'శారీరక సంబంధం' అంటే
# రేప్ కాదు

**పోక్సో కేసులో నిందితుడికి విముక్తి**

- పోక్సో కేసులో నిందితుడిని నిర్దోషిగా ప్రకటించిన ఢిల్లీ హైకోర్టు
- 'శారీరక సంబంధం' అనే పదం అత్యాచారానికి రుజువు కాదని స్పష్టం
- బాధితురాలు వాడిన పదం చాలా అస్పష్టంగా ఉందని కోర్టు వ్యాఖ్య
- ఎఫ్ఐఆర్ నమోదులో ఏడాదిన్నర జాప్యంపై హైకోర్టు ప్రశ్నలు
- ట్రయల్ కోర్టు విధించిన 10 ఏళ్ల జైలు శిక్ష రద్దు
- నిందితుడిని వెంటనే విడుదల చేయాలని ఆదేశం

ఢిల్లీ,: పోక్సో చట్టం కింద నమోదైన ఒక కీలక కేసులో ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధితురాలు తన వాంగ్మూలంలో ఉపయోగించిన 'శారీరక సంబంధం' అనే పదంచాలా అస్పష్టంగా ఉందని, కేవలం ఆ పదాన్ని ఆధారంగా చేసుకుని అత్యాచారం లేదా లైంగికదాడి జరిగిందని నిర్ధారించలే మని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ట్రయల్ కోర్టు విధించిన పదేళ్ల కఠిన కారాగార శిక్షను రద్దు చేస్తూ నిందితుడిని నిర్దోషిగా ప్రకటించింది.



## నేడు తెలంగాణ
# కేబినేట్ భేటీ

**బిసి రిజర్వేషన్లు..స్థానిక ఎన్నికలపై చర్చ...**

**హైదరాబాద్,అక్టోబర్22, తెలంగాణ దిశ :** తెలంగాణ మంత్రి వర్గంసీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాయలంలో సమావేశం కానుంది. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ చర్చించనుంది. దీంతో ఇటీవల భేటీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సుకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అలాగే, ఎస్ఎల్బిసి పునరుద్ధరణ పనులు, ఎస్ఆర్ఎస్పి రెండో దశకు రాంరెడ్డి దామోదర రెడ్డి పేరు, కాళేశ్వరం పునరుద్ధరణ సహా పలు ప్రాజెక్ట్ పనుల పై మంత్రి వర్గం చర్చించనున్నట్లు సమాచారం.



## ద్రౌపది ముర్ముకు తప్పిన
# ప్రమాదం

- కొచ్చి స్టేడియంలో బురదలో కూరుకుపోయిన హెలికాప్టర్
- నాలుగు రోజుల పర్యటనలో భాగంగా జరిగిన ఘటన
- అతి కష్టం మీద పక్కకు నెట్టిన భద్రతా సిబ్బంది
- శబరిమల దర్శనానికి వెళ్తుండగా ఘటన

కొచ్చి: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కేరళ పర్యటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండింగ్ సమయంలో బురదలో కూరుకుపో వడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అయితే, భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తేవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాలుగు రోజుల పర్యటన నిమిత్తం కేరళలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇవాళ ఆమె శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకోవాల్సి ఉంది. ఇందుకోసం కొచ్చిలోని ప్రమదం స్టేడియానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. అయితే, హెలికాప్టర్ ల్యాండ్ అయిన సమయంలో దాని టైర్లు ఒకవైపు బురదలో పూర్తిగా దిగబడిపోయాయి.

## రవాణాశాఖలో ఏఐ సాంకేతికత
# అమలు

- షోరూముల్లోనే వాహన రిజిస్ట్రేషన్ల పరిశీలన
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** దిల్లీలో కాలుష్యం ఎలా ఉందోఅందరం చూస్తూనేఉన్నామని..అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ప్రణాళికలు చేపట్టినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.రవాణాశాఖ కార్యాలయాల్లో మధ్యవర్తులు లేకుండా చేస్తాం. ఈ శాఖలో ఏఐ వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రూ.577 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చాం. దీంతో ఆ వాహనాల విక్రయాలు 0.03 శాతం నుంచి 1.30 శాతానికి పెరిగాయి.

## గోండు బెబ్బులి కుమ్రం : కేటీఆర్



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** ఆదివాసీ యోధుడు.. తిరుగుబాటు వీరుడు.. గోండు బెబ్బులి కుమ్రం (కొమురం) భీమ్ జయంతి సంద ర్భంగా ఆ మహనీయుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘన నివాళులర్పించారు. బీఆర్ఎస్ హయాంలో, కేసీఆర్ నేతృత్వంలో కుమ్రం భీమ్ ఇచ్చిన జల్, జంగల్, జమీన్ నినాదమే స్ఫూర్తిగా పాలన అందించామని గుర్తుచే శారు. వారి ఆశయాల సాధన దిశగా పయనించామని తెలి పారు. ఎస్టీ గురుకులాలు, కాలేజీల సంఖ్య పెంచడం, అంబే ద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందించడం, సీఎంఎస్టీఈఐ స్కీం ద్వారా గిరిజన బిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిది ద్దడం కుమ్రం భీమ్ స్ఫూర్తిగా ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామ ని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో ఆసిఫా బాద్ జిల్లా కు కుమ్రం భీమ్ పేరు పెట్టుకున్నందుకు, జోడేఘాట్‌లో సుం దరమైన స్మృతి వనాన్ని ఏర్పాటు చేసినందుకు, హైదరా బాద్ మహానగ రంలో కుమ్రం భీమ్ పేరిట ఆదివాసీ భవనాన్ని నిర్మించి నందుకు గర్విస్తున్నామన్నారు.

## రంగంలోకి..
# కేసీఆర్

**నేడు ముఖ్య నేతలతో కీలక సమావేశం**

- జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై దృష్టి సారించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- నేడు ఫామ్‌హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం
- ఎన్నికల ప్రచారంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న గులాబీ బాస్
- సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ పట్టుదల
- క్షేత్రస్థాయిలో కేసీఆర్ ప్రచారంపై కొనసాగుతున్న సందిగ్ధత

హైదరాబాద్, తెలంగాణ దిశ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికను బీఆర్ఎస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, ఎన్నికల వ్యూహరచనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా నేడు తన ఫామ్‌హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో ఆయన కీలక సమావేశం నిర్వహించనున్నారు.



ఈ భేటీలో ఉపఎన్నిక ప్రచార సరళిపై చర్చించి, నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ సిట్టింగ్ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవాలనిబీఆర్ఎస్ పట్టుదలగా ఉంది. ఇప్పటికే ఆ పార్టీ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ అర్ధాంగి మాగంటి సునీతను ప్రకటించింది. ఆమె నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు 40 మంది స్టార్ క్యాంపెయినర్ల బృందం కూడా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటోంది. అయితే, కేసీఆర్ స్వయంగా ప్రచారంలో పాల్గొంటా రా? లేదా? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు, ఈ ఉపఎన్నికను కాంగ్రెస్, బీజేపీలు కూడా సవాలుగా తీసుకున్నాయి.



## బంగాళాఖాతంలో
# అల్పపీడనం

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడింది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ గురువారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకొని ఉన్న నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ పేర్కొంది.
ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు కదులుతూ రాబోయే 24గంటల్లో మరింత బలపడే అవకా శాలున్నాయని తెలిపింది.



## తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు
# పెట్టండి

- దిగ్గజ సంస్థ 'ఒరికా'కు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం
- ఆస్ట్రేలియాలో సీఈఓ సంజీవ్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ

**మంథని, తెలంగాణ దిశ :** దేశంలోనే పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యక లాపాలను నిర్వహిస్తున్న దిగ్గజ సంస్థ 'ఒరికా' ప్రతినిధులను తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకోరారు. ఆదేశ పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బో ర్న్‌లోపారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న ఆ సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో 'ఒరికా' ప్రస్తుత కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. 'ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. జీసీసీలు, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిం చే ప్రగతిశీల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉంది' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కంపెనీ ప్రతినిధులకు వివరించారు. ఇండస్ట్రియల్ ఇన్నో వేషన్, సస్టెయినబిలిటీ, మాన్యుఫాక్చరింగ్, మైనింగ్ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు.



## బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్
# చేసినట్టా..?

**దౌర్భగ్యస్థితి కాంగ్రెస్ సర్కారు**

**కేంద్రమంత్రి బండిసంజయ్ ఫైర్**

**హైదరాబాద్, అక్టోబర్22, తెలంగాణ దిశ :** పెం డింగ్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్ లాగా సీఎం రేవంత్‌రెడ్డి ఫీల్ అవుతున్నారని, కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇత రత్రా పెండిం గ్ బిల్లులు చెల్లించలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉన్నదని కేంద్ర మంత్రి బండిసంజయ్ ఫైర్ అయ్యా రు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలను తక్ష ణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయ కుండా కాలరాస్తు న్నారంటూ ఫైర్ అయ్యారు. బకాయిలు చెల్లిం చాల్సిందే అంటూ పట్టుబడిన బండి సంజయ్.. ప్రభుత్వానికి పలు అం శాలపై ప్రశ్నల వర్షం కురిపించారు.బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్ మెయిల్ చేస్తారా? విద్యా ర్థులు, యాజమాన్యాల భవిష్యత్తుతో చెలగాట మాడ తారా?విద్యార్థులు, యాజమా న్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయమని వార్నింగ్ ఇచ్చారు. యాజమా న్యాలూ... ప్రభు త్వానికి భయప డి సమ్మె విర మిస్తే అంతే సం గతులు.. భవిష్యత్తు లో ఎవరూ అండగా నిల బడే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఆరోగ్య శ్రీ బకాయిలపైనా రోడ్డెక్కడం తథ్యమని వెల్లడిం చారు. మంత్రులు ప్రతి పనికి కమీషన్లు వసూ లు చేస్తున్నారని ఆరోపించారు. ఆ సొమ్మును కాంగ్రెస్ హైకమాండ్‌కు కప్పం కడుతున్నా రంటూ బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# జర్నలిస్టులకు కేటాయించిన 38 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె నిర్మాణం







**కుత్బుల్లాపూర్,అక్టోబర్ 22, (తెలంగాణ దిశ) :**మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 25/2 లోని 38 ఎకరాల భూమి చుట్టూ బుధవారం ఫెన్సింగ్ వేసింది. గతంలో భూమిని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి రాష్ట్ర ప్రభుత్వం 2008లో కేటాయించింది. ఈ భూమిని జర్నలిస్టులకు కేటాయిస్తూ హెచ్‌ఎండీఏ కస్టడీలో ప్రభుత్వం ఉంచిన విషయం విధితమే.

అయితే ఈ కేటాయింపులపై కొంత మంది కోర్టు కెళ్లడంతో అక్కడ జర్నలిస్టులకు ప్లాట్ల పంపిణీ జరగలేదు. కోర్టులో వివాదం ఉంటుండగానే.. మరోవైపు అక్కడ ఆక్రమణలు జరుగుతున్నాయని హైడ్రాకు సొసైటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై అక్కడ రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు కూడా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, హెచ్ ఎండీఏ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించుకుంది. ఇప్పటికే కొంత మంది ఇళ్లు కట్టుకుని ఉండగా.. వాటి జోలికి పోకుండా ఇంకా ఖాళీగా ఉన్న భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఈ విషయమై కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేయగా.. కోర్టు తీర్పు ప్రకారం ఆస్థలం కేటాయింపులు జరుగుతాయి. ఈ లోగా అక్రమణలు జరగకుండా ప్రభుత్వ భూమిని కాపాడుతున్నట్టు హైడ్రా స్పష్టం చేసింది. అలాగే అక్కడ ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారితో త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. ఈ సమావేశంలో హైడ్రా,రెవెన్యూ, హెచ్ ఎండీఏ, మున్సిపల్ అధికారులు కూడా ఉంటారని తెలిపారు.



## జిల్లాలో ఊపందుకున్న వైన్ షాపుల దరఖాస్తుల స్వీకరణ : నేడు చివరి తేదీ



**మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లో** వైన్ షాపుల లైసెన్సుల కోసం దరఖాస్తుల స్వీకరణ చివరిదశకు చేరుకుంది. మేడ్చల్ యూనిట్ పరిధిలోని 118 షాపులకు బుధవారం 14కొత్త అప్లికేషన్లుఅందగా, ఇప్పటివరకు మొత్తం 5,548 దరఖాస్తులను స్వీకరించారు. అలాగే మల్కాజిగిరి యూనిట్ పరిధిలోని 88 షాపులకు బుధవారం 18 అప్లికేషన్లు అందగా, ఇప్పటి వరకు4,800 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపా రు.గురువారం(అక్టోబర్ 23) దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందని, అక్టోబర్ 27న శ్రీ పలని కన్వెన్షన్ హాల్‌లో లాటరీ ద్వారా లైసెన్స్ హోల్డర్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు గురువారం దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా ఎక్సైజ్ అధికారులు సూచించారు.

(మేడ్చల్ జిల్లా ప్రతినిధి, తెలంగాణ దిశ)

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం : మొగిలి సునీతరావు

### - జూబ్లీహిల్స్ లో మహిళా కాంగ్రెస్ పాదయాత్ర
### - రహమత్ నగర్‌లో సునీతా రావు పాదయాత్రకు అపూర్వ స్పందన







**జూబ్లీహిల్స్, అక్టోబర్ 22, (తెలంగాణ దిశ) :**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల స్టార్ క్యాంపెనర్ మొగిలి సునీతరావు బుధవారం వెంగళరావు నగర్ డివిజన్‌లోని రహమత్ నగర్ ప్రాంతంలో గడప గడపకి పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ సతీమణి వర్షా యాదవ్, మహిళా కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్, స్థానికమహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు. రహమత్ నగర్ వీధులు జెండాలతో,నినాదాలతో ఉత్సాహ భరితంగా మారాయి. పాదయాత్ర సందర్భంగా సునీతా రావు ప్రజలతో మమేకమై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నందుకు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు. ఉచితబస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఉచిత త్రాగునీరు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆరోగ్య లక్ష్మి, రూ. 500 వంట సిలిండర్ వంటి పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నాయని వివరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నారని సునీతా రావు పేర్కొన్నారు. "ప్రజల స్పందన చూస్తుంటే ఖచ్చితమైన గెలుపు కాంగ్రెస్‌దేం జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# రాజకీయాల్లో సోషల్ మీడియాదే కీలక భూమిక : బండారి లక్ష్మారెడ్డి





**జూబ్లీహిల్స్, అక్టోబర్ 22, (తెలంగాణ దిశ) :**ప్రస్తుత రాజకీయాలలో సోషల్ మీడియా కీలక భూమిక పోషిస్తోందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో శ్రీ నగర్ కాలనీ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోషల్ మీడియా వారియర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ప్రజల హృదయాల్లో నిలిచిన పార్టీ అని అన్నారు. పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఒక మంచి సంకల్పంతో తెలంగాణను అన్ని రంగాలలో తీర్చిదిద్దారని కొనియాడారు.

బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే బాధ్యత సోషల్ వారియర్స్ దేనన్నారు. అధికార పక్షంతో పాటు బిజెపి చేస్తున్న తప్పుడు ప్రచారాలను సమర్ధవంతంగా తిప్పి కొట్టాలని సూచించారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ ఫేస్ బుక్ పోస్ట్,ట్విటర్, ఇంస్టాగ్రామ్, వాట్సాప్, త్రెడ్స్, యూట్యూబ్, స్నాప్ చాట్ తదితర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లలో గత పదేళ్లలలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. మనం వాస్తవాలు, అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రజలతో బిఆర్ఎస్ పార్టీతో ఉన్న అనుబంధాన్ని సోషల్ మీడియాలో ప్రతిబింబించాలన్నారు. మన బలం ప్రజల నమ్మకం, దానిని మరింత బలపరచడం మన బాధ్యత అని పిలుపునిచ్చారు.ఈ ఉపఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త డిజిటల్ స్థాయిలో చురుకుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జ్ సతీష్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం యువతతో పాటు ఐటీ వింగ్స్ సభ్యులు డిజిటల్ క్యాంపెయిన్ కార్యక్రమాలపై చర్చించారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : రవీందర్ నాయక్

### - డిఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని సందర్శించిన డైరెక్టర్ రవీందర్ నాయక్





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22,(తెలంగాణ దిశ):** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. రవీందర్ నాయక్ సూచించారు బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, సెక్షన్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న టీబీ నియంత్రణ, ఎన్‌సీడీ కార్యక్రమాలు,ఇమ్యూనైజేషన్, ఫ్యామిలీ ప్లానింగ్, ఆసుపత్రుల నిర్వహణ వంటి ముఖ్యమైన ఆరోగ్య కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుత ప్రగతిని విశ్లేషిస్తూ, భవిష్యత్ కార్యచరణ ప్రణాళికలపై డైరెక్టర్ పలు సూచనలు అందించారు.

ఈసందర్భంగా రవీందర్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సత్యవతి, డాక్టర్ కౌశిక్, డాక్టర్ వినోద్, కార్యాలయ సిబ్బంది వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థి సునీత విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**జూబ్లీహిల్స్, అక్టోబర్ 22, (తెలంగాణ దిశ) :**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బిఆర్ఎస్ ప్రచారం ఊపందుకుంది. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపును కాంక్షిస్తూ శ్రీనగర్ కాలనీ ఎల్లారెడ్డి గూడలలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే,పీజేఆర్ కుమారుడు విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు బుధవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ అభ్యర్థి సునీత విజయాన్ని కాంక్షిస్తూ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ ప్రచారంలో స్థానిక నాయకులు, మహిళా కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. ప్రచార బృందం ఎల్లారెడ్డి గూడలో గడప గడపకు వెళ్లి ఓటర్లను కలుసుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అభివృద్ధి బిఆర్ఎస్ పాలనలోనే సాధ్యమైందన్నారు. పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని అన్నారు. ప్రస్తుత ఈ ఉప ఎన్నికలో సునీతను గెలిపించి అధికార కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. సునీత ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సునీత విజయం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రచారానికి ప్రజల నుండి మంచి స్పందన లభించగా, జూబ్లీహిల్స్ ప్రజలు బిఆర్ఎస్ అభ్యర్థి సునీతకు పూర్తి మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థి సునీత విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం



**జూబ్లీహిల్స్, అక్టోబర్ 22, (తెలంగాణ దిశ) :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బిఎస్ఎస్ పార్టీ కార్యకర్తలు బుధవారం బోరబండ డివిజ న్‌లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ప్రచారం చేపట్టారు. బిఆర్ఎస్ నేతలు ప్రజలను కలుసుకుని, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ ను గెలిపించాలని కోరారు.


ఎన్నికల్లో అభ్యర్థి విజయం ద్వారా అభివృద్ధి కొనసాగుతుందని, స్థానిక సమస్యలు పరిష్కారం లభిస్తుందని వారు వివరించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కుతాడి సురేష్, స్థానిక బూత్ కమిటీ అధ్యక్షుడు ఎండి. జానీ, ఎండి. అల్లావుద్దీన్, పార్టీ నాయకులు వలపు విజయ్, గాజుల నవీన్ గౌడ్, పలేపాటి రవికుమార్, దండబోయిన బాలరాజు యాదవ్, నాగారం నరేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని బిఆర్ఎస్ నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# శ్రీ సహస్రలింగేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారి చీరల బహిరంగ వేలం

**కాప్రా, అక్టోబర్ 22, (తెలంగాణ దిశ) :**

ఈసీఐఎల్ చౌరస్తా సమీపంలోని టిఎస్ఐఐసి కాలనీ, కమలానగర్‌లోని శ్రీ సహస్రలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 27, నవంబర్ 3 ,10 తేదీలలో అమ్మవారి చీరల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. దేవాదాయ-ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ వేలం ద్వారా "శ్రీ లలితాంబ అమ్మవారికి కానుకలుగా వచ్చిన చీరలను (అలంకరించి తీసినవి)" విక్రయించనున్నామని తెలిపారు. పై మూడు రోజులు ఉదయం 10:30 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో వేలం ప్రారంభమవుతుందని ఆలయ మేనేజర్ తెలిపారు. అమ్మవారి భక్తులు, ఆసక్తి గల వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# సంపాదకీయం

## కరూర్ లాంటి ఘటనలు ఆపలేమా ?

దేశంలో రాజకీయ పార్టీల కార్యకలాపాలు నానాటికీ శృతి మించుతున్నాయి. ప్రజల ప్రాణాలంటే లెక్క లేకుండా పోయింది. ప్రజలను ఏమార్చడం, సెంటిమెంట్లను రెచ్చగొట్టడం, అధికారం సంపాదించ డం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల విన్యాసాలు ప్రజలప్రాణాల మీదకు తెస్తున్నాయి. కరూర్ ఘటనపై మద్రాస్ హైకోర్టు సిట్‌ను వేసింది. దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికి తీసినా అందుకు కారకులైన ఆ పార్టీ వారిమీద ఎలాంటి చర్యలు ఉంటాయన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో ఇలాంటి ఘటనలు చూశాం. ఎపిలో చంద్రబాబు హయాంలో గోదావరి పుష్కరాల సందర్భంగా పదుల సంఖ్యలో చనిపోయారు. జగన్ మొన్నటికి మొన్నర్యాలీలో ఒకరిద్దరు చనిపోయారు. రాజకీయ నేతల హత్యలుగా వీటిని పరిగణించి చర్యలు తీసుకుని ఉంటే కరూర్ ఘటన జరిగివుండేది కాదు. భారీగా బహిరంగ సభలు నిర్వహించడం, ర్యాలీలు చేపట్టడం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయి. అయినా ఆయా పార్ఈల నేతల్లో కించిత్తు కూడా పశ్చాత్తాపం లేదు. తమిళనాడు కరూర్‌లో టివికె నాయకుడు, సినీ నటుడు విజయ్ సభలో చోటుచేసుకున్న మహా విషాదం మాటలకందనిది. నిర్వాహకుల భద్రతా లోపాలే తొక్కిసలాటగా మారి 41 మంది ప్రాణాలను బలిగొనడం ఏమాత్రం క్షంతవ్యం కాదు. ఇలాంటి ర్యాలీలు చేపట్టి ఏం ఉద్ధరిస్తారన్నది ప్రజలు కూడా ఆలోచించాలి. వీరంతా మన ఓట్లను కొల్లగొట్టే యంత్రాలని గుర్తించాలి. మనదగ్గర ఓటు ఆయుధం ఉందని గుర్తించి మసలుకోవాలి. నటుడు విజయ్‌ను చూడడానికి వచ్చిన 41మంది చనిపోతే ఆ కుటుంబాలు ఏం కావాలి. తీవ్రంగా గాయపడిన 80 మందిలో ఐదుగురి పరిస్థితి నేటికీ విషమంగానే ఉంది. ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారంతా అణగారిన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారే. వారిని ఆదుకునేందుకు ఎలాంటి ప్రణాళిక ఉందో చెప్పడం లేదు. వారి కుటుంబాలకు భరోసా ఎవరు ఇస్తారో చెప్పడం లేదు. పోలీసులు ఇలాంటి ర్యాలీలకు అనుమతి ఇచ్చేముందు ఎందుకు ఆలోచించరన్నది కూడా ముఖ్యమే. హీరో విజయ్ వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల కోసం ఈ నెల 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వీకెండ్ రోడ్ షోలు ప్రారంభించారు. విజయ్ ను చూసేందుకు అత్యధిక సంఖ్యలో సభలకు తరలివస్తున్నారు. వారికి తగిన భద్రత కల్పించడం, వారు ఇళ్లకు క్షేమంగా చేరుకునేలా ఏర్పాట్లు చేయడం నిర్వాహకుల బాధ్యత. అలాంటి బాధ్యతలను గాలికి వదిలేయడంతో తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తమ పార్టీపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారంటూ టివికె పార్టీ చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందుకంటే ఇలాంటి ర్యాలీలు నిర్వహించి ఏం చేస్తారన్నది చెప్పాలి. తగిన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, ఆస్తుల విధ్వంసం చేస్తున్న వారిపై నిర్వాహకు లకు నియంత్రణ ఉండటం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం మద్రాసు హైకోర్టులో నాలుగు రోజుల క్రితమే వాదనలు వినిపిం చాయి. ఆస్తినష్టం జరగకుండా ముందస్తుగా సభల నిర్వాహకుల నుంచి డిపాజిట్లు వసూలు చేయాలంటూ హైకోర్టు ఆదేశించింది. బహిరంగ సభలు, ఊరేగింపులు తదితర సందర్భాల్లో మార్గద ర్శకాలపై నివేదిక సమర్పించాలంటూ ధర్మాసనం ఆదేశించినా, సరైన జాగ్రత్తలు తీసుకోలేదనడానికి కరూర్ ఉదంతమే సాక్ష్యం. కరూరులో అభిమానులు రాత్రి 7.30 గంటలకు విజయ్ వచ్చేవరకూ ఎండలో, కనీసం తాగునీళ్లిచ్చే దిక్కులేక, ఆహారం లేక అలమటించాల్సి వచ్చింది. 10 వేల మంది సభకు వస్తారని నిర్వాహకులు అనుమతి తీసుకుని, 30 వేల మందికిపైనే మూడు జిల్లాల నుంచి సమీకరించారు. విజయ్ ను దగ్గర నుంచి చూడాలంటూ కొందరు అభిమానులు చెట్టు ఎక్కగా, ఆ చెట్టు కొమ్మ విరిగిపడటమే తొక్కిసలాటకు కారణమని చెబుతున్నారు. నీరసంగా ఉన్న అభిమానుల కోసం విజరు తన కాన్వాయ్ నుంచి నీళ్ల సీసాలు విసరడం, కొందరు అత్యుత్సాహంతో కాన్వాయ్ వద్దకు తోసుకెళ్లడమూ గందరగోళానికి కారణమైందంటున్నారు. భారీ సంఖ్యలో అభిమానులు చేరుకోవడం, నిర్వాహకులు, స్థానిక అధికారుల మధ్య గందరగోళం, నిర్వహణాలోపమే ఘటనకు ప్రధాన కారణం. వెనువెంటనే సంఘటనా స్థలానికి సిఎం వచ్చి, పరామర్శించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం, మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబాలకు అందించడం, నష్టపరిహారం ప్రకటించడం ఉపశమనం కలిగించే వే! రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. పరిహారం ప్రకటించిన విజయ్ బాధిత కుటుంబాలను పరామర్శించ కుండా వెనుదిరగడమూ చర్చనీయాంశమైంది. దీనిని మద్రాస్ హైకోర్టు కూడా తప్పు పట్టింది. ఇక వారే సిబిఐ విచారణ కోరడంమరీ దారుణం. ఆయన కానీ, వారి పార్టీ నాయకులు గానీ క్షతగాత్రులకు వైద్యమందించిన ఆసుపత్రులకైనా వెళ్లకపోవడం శోచనీయం. రాజకీయ సభలైనా, మతపరమైనవైనా, ఏ కార్యక్రమ మైనా? అక్కడికి వచ్చే ప్రజల ప్రాణాలను కాపాడి, క్షేమంగా ఇళ్లకు చేర్చాల్సినబాధ్యత నిర్వాహకులదే. ఇరుకుగాఉండే ప్రదేశాలను జనా కర్షణ కలిగిన నేతల భారీ సభల కోసం, రోడ్‌షోల కోసం వినియోగించకుండా, విశాల ప్రదేశాల్లోనే సభలు నిర్వహించేలా చూడటం అవసరం. పదుల సంఖ్యలో అమాయక ప్రజల మరణానికి కారణమైన ఇటువంటి తొక్కిసలాట ఘటనల సంద ర్భంగా జరిగిన నిర్వహణ వైఫల్యాలు, పాలనా యంత్రాంగం లోపాలు వంటివి సమీక్షించి, తగు చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. మద్రాస్ హైకోర్టు సూచనల మేరకు ఇలాంటి ర్యాలీలపై నిషేధం విధించాలి.

# పట్టణ ప్రాంత పేదలకు శుభవార్త..

### - జి ప్లస్1 తరహాలో ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే అవకాశం
### - మారనున్న మురికి వాడల రూపురేఖలు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదారాబాద్, అక్టోబర్ 22, (తెలంగాణ దిశ) :** పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గ్రామీణ ప్రాంతాలలో శర వేగంగా సాగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లపై బుధవారం మంత్రి సచివాలయం లోని తన కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఇరుకు స్థలాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు పక్కా ఇంటి వసతిని కల్పించేలా ఇందిరమ్మ పథకాన్ని వర్తింప చేస్తున్నామని అన్నారు. కనీసం 30 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జి ప్లస్ 1 తరహాలో ఇంటిని నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. గ్రౌండ్ ఫ్లోర్ లో 200 చదరపు అడుగులు, మొదటి అంతస్తులో మరో 200 చదరపు అడుగులు నిర్మించుకునేలా ఈ మేరకు జీవోఎంఎస్ నెంబర్ 69 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో పేదలకు పక్కా ఇంటి వసతిని కల్పించాలన్న లక్ష్యంతో పాటు, స్థలాల కొరతను దృష్టిలో ఉంచుకుని కొన్ని సడలింపులు ఇచ్చామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోనిపేదలకు పక్కా ఇంటి వసతి కోసం కొద్ది కాలంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అధ్యయనం చేశామని తెలిపారు. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, నగరాల్లోని పేదలు సొంత ఇంటిని నిర్మించుకోడానికి తగిన స్థలం లేక,అరకొర వసతులతో తాత్కా లిక ఏర్పాట్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అటువంటి వారి కోసం ఇందిరమ్మ ఇండ్ల ను నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అనేక మంది 60 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలోని రేకులషెడ్లు, ఇతరత్రా తాత్కాలిక ఏర్పాట్లుతో జీవిస్తున్నారు. వీరికి ఆర్‌సిసి స్లాబుతో పక్కా ఇంటిని నిర్మించాలంటే తగిన స్థలం అందుబాటులో లేదన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి పట్టణ ప్రాంతాల్లో జిప్లస్1నిర్మాణాలకు అనుమతినిస్తూ, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అంద జేస్తున్న రూ.ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని దశల వారీగా నిర్మాణపు పనుల స్థాయిని బట్టి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

**పట్టణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణం ఎలా ఉండాలంటే....**

జిం1 విధానంలో పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు 96 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 70 అడుగుల విస్తీర్ణంలో వేర్వేరుగా రెండు గదులతోపాటు, కనీసం 35.5 చదరపు అడుగుల్లో వంటగదిని నిర్మించుకోవాలన్నారు

ప్రతి ఇంటికి ప్రత్యేకంగా టాయిలెట్, బాత్ రూంలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ఇంటి నిర్మాణం ఆర్ సిసి స్లాబ్ తో ఉండాలని, ఇందుకు సంబంధించిన స్ట్రక్చరల్ డిజైన్లకు డిఇఇ (హౌసింగ్)అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

**నాలుగు దశల్లో రూ.5 లక్షలు చెల్లింపు...**

మొదటి అంతస్తు - రూఫ్ లెవల్ వరకు నిర్మాణం అయితే రూ. 1 లక్ష , అటు తరువాత గ్రౌండ్ ఫ్లోర్ %-% రూఫ్ వేసిన తరువాత రూ. 1 లక్ష, ఆపైన ఫస్ట్ ఫ్లోర్ లో కాలమ్స్, స్లాబ్, గోడల నిర్మాణాలు పూర్తి అయిన పిదప రూ. 2 లక్షలను,ఇంటి నిర్మాణపు పూర్తి అయిన తరువాత మరో లక్ష రూపాయలను విడుదల చేస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదవాళ్ల ఇంటికోసం ఐదు లక్షల రూపాయిలు ఖర్చు చేయడం లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక ఎత్తు అయితే, పట్టణ ప్రాంతాల్లో మరో ఎత్తు అని, ఇది ప్రభుత్వానికి ఒక సవాల్ అని దీనిని దృష్టిలో ఉంచుకుని, పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రజా సంక్షేమం కోసం పని చేయాలి

### -మందుముల పరమేశ్వర్ రెడ్డి



**ఏఎస్ రావునగర్, అక్టోబర్ 22, (తెలంగాణ దిశ)** ప్రజా సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు ముదిగొండ లింగస్వామి, భద్రగామ నరసింహ తదితరులు పరమేశ్వర్ రెడ్డిను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీ బలపరచడంలో పరమేశ్వర్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పరమేశ్వర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బల పడుతోందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈసందర్భంగా పరమేశ్వర్ రెడ్డి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# ట్రంప్ చర్యలతో అప్రమత్తంగా ఉండాల్సిందే


### ప్రత్యమ్నాయ రంగాలపై దృష్టి సారించాలి




న్యూఢిల్లీ, : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పుణ్యమా అని అనేక అనూహ్య ఘటనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా భారత్ అనేక పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. ట్రంప్ ఏ రోజు ఎలాంటి ఆంక్షలు తెస్తారో తెలియకుండా ఉంది. మేకిన్ ఇండియా అంటున్న భారత్ ప్రధాని అందుకు తగ్గట్లుగా కార్యాచరణకు దిగాలి. స్వయం సమృద్ధి సాధించే లా ప్రయత్నాలు ప్రారంభించాలి. ముఖ్యంగా యువత ఊనైపుణ్యలకు పదను పెట్టాలి. ఇకపోతే దాదాపు ఐదేళ్ల తర్వాత అక్టోబర్ 26 నుండి భారత్- చైనాల మధ్య విమాన రాకపోకల పున:ప్రారంభానికి కేంద్రం గ్రీన్ సిగల్ ఇచ్చింది. ఈ విషయాన్ని తాజాగా ఓ సీనియర్ ప్రభుత్వాధి కారి వెల్లడించారు. శీతాకాలం ప్రారంభమయ్యే కాలంలో భారత్- చైనాల మధ్య నేరుగా విమాన రాకపోకల్ని అక్టోబర్ 26 నుండి పున:ప్రారంభించడానికి అంగీకరించినట్లు భారత విదేశాంగ మంత్రి త్వశాఖ ప్రకటించింది. మరోవైపు అక్టోబర్ 26 నుండి కోల్‌కతా- గ్వాంగ్‌జౌ రోజువారీ సేవలను ప్రారంభించనున్నట్లు ఇండిగో విమానయాన సంస్థ తెలిపింది. ఇరు దేశాల మధ్య నియంత్రణ ఆమోదాలు అమల్లోకి వచ్చిన తర్వాత న్యూఢిల్లీ నుండి చైనాకు రోజువారీ విమాన సేవలను అందుబాటులోకి తేనున్నట్లు ఇండిగో తెలిపింది. చైనా సదరన్ ఎయిర్‌లైన్స్, సిచువాన్ ఎయిర్‌లైన్స్‌లు కార్గో విమానాలకు అనుమతి కోరాయి. భారతీయ విమానయాన సంస్థలు ఇరు దేశాల మధ్య సేవల్ని కొనసాగించడానికి ఒప్పందానికి కట్టుబడి ఉన్నాయి. ప్రస్తుత ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం ఆరు గమ్యస్థానాలకు చేరుకోవడానికి వీలుకల్పిస్తుంది. అయితే వారంలో 42 విమానాల కంటే ఎక్కువ నడపకూడదని ఒప్పందంలో ఉంది. చైనా విమానాలు ప్రతివారం 42 విమానాలను నడుపుతున్నాయి. వాటిలో ఎయిర్ చైనా (బీజింగ్- ముంబై) వారానికి నాలుగుసార్లు, బీజింగ్ -ఢిల్లీకి ఐదుసార్లు సార్లు ప్రయాణీకుల రాకపోకల్ని కొనసాగిస్తున్నాయి. చైనా సదరన్ ఎయిర్‌లైన్స్ ఢిల్లీ-గ్వాంగ్‌జౌకు రోజుకు రెండుసార్లు సర్వీసుల్ని కొనసాగిస్తుంది. చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ వారానికి ఎనిమిది, వాటిలో రోజువారీ ఢిల్లీ- షాంఘై విమానాలను నడుపుతుంది. షాన్డాంగ్ ఎయిర్‌లైన్స్ కున్మింగ్ నుండి ఢిల్లీకి వారానికి నాలుగుసార్లు విమానాల ను నడుపుతుంది. రువాండాకు చెందిన రువాండ్ ఎయిర్‌లైన్స్ కూడా వారానికి మూడుసార్లు గ్వాంగ్జౌ- ముంబైల మధ్య విమాన సర్వీసుల్ని కొనసాగిస్తుంది. భారతీయ విమానయాన సంస్థల్లో ఒకటైన ఎయిర్ ఇండియా న్యూఢిల్లీ నుండి వారానికి ఐదుసార్లు షాంఘైకి విమానా లను నడుపుతుంది. ఇండిగో కూడా చెంగ్డు- ఢిల్లీ, గ్వాంగ్జౌ- కోల్‌కతా ల మధ్య రోజువారీ విమానలను నడిపింది. ఈ నేపథ్యంలో ప్రయాణీ కుల, కార్గో విమానాల కోసం ఐదు చైనా ఎయిర్‌లైన్స్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఏ)ని సంప్రదించాయి.

విమా నాల రాకపోకలు పున:ప్రారంభించడానికి ఇక ఆలస్యం చేయకూడదని భారత్- చైనా నేతలు కోరుకుంటున్నారని ప్రభుత్వాధికారి పేర్కొన్నారు. ఇక ఇరు దేశాల మధ్య సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి, ప్రభుత్వ వ్యూహంలో భాగంగా ఈ సంవత్సరం ప్రారంభం నుండి రెండు దేశాలు సాంకేతికస్థాయి చర్చలు జరుపుతున్నాయని, ఇందులో విమాన సేవా ఒప్పందం కూడా ఉందని భారత విదేశాంగశాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఇండిగోతోపాటు, ఎయిర్ ఇండియా కూడా ఈ ఏడాది చివరి నుంచి షాంఘైకి విమాన సర్వీసులను ప్రారంభించాలని యోచిస్తోంది. ఇక ఆకాశ విమానయాన సంస్థ కూడా అదే ఆలోచనలో ఉంది. చైనా నుంచి భారత్‌కు చేరే ప్రయాణీకుల కోసం చైనా కూడా షాంఘై -ఢిల్లీ (వారానికి ఐదు విమానాలు) విమాన సర్వీసులను ప్రారంభించింది. వీటికి డిజిసిఏ అనుమతినిచ్చింది. ప్రయాణీకుల విభాగంలో ఎయిర్ చైనా, షాన్డాంగ్‌లు దరఖాస్తు చేసుకున్నాయి.

## నలుపును పోగొట్టాలంటే..



అందాన్ని కాపాడుకోవడానికి.. ముఖంపైనే ఎక్కువ శ్రద్ధ పెడుతుంటారు. ఇతర శరీర భాగాలపై నిర్లక్ష్యం చూపుతుంటారు. ముఖ్యంగా, చర్మం మందంగా ఉండే మోచేతులు, మోకాళ్లను మరీ అశ్రద్ధ చేస్తుంటారు. దాంతో ఆయా భాగాలు నల్లగా మారిపోయి.. అందవిహీనంగా కనిపిస్తుంటారు. కాస్త శ్రద్ధ పెడితే.. మోచేతులు, మోకాళ్ల దగ్గర చర్మం నల్లదనాన్ని పోగొట్టుకోవచ్చని బ్యూటీషియన్లు చెబుతున్నారు. నిమ్మకాయ సహజసిద్ధమైన బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి.. చర్మంలోని మృత కణాలను సమర్థంగా తొలగిస్తుంది. చర్మం రంగునూ మెరుగుపరుస్తుంది. నిమ్మకాయ ముక్కలతో మోచేతులు, మోకాళ్లపై రుద్దితే.. మంచి ఫలితం కనిపిస్తుంది. చర్మం రంగును మెరిపించడంలో పెరుగు ముందుంటుంది. ఇందులో లభించే లాక్టిక్ యాసిడ్.. చర్మాన్ని తేమగా ఉంచుతుంది. మోచేతులు, మోకాళ్లపై పెరుగును అప్లయి చేయాలి. 15-20 నిమిషాలపాటు అలాగే వదిలేసి.. గోరు వెచ్చని నీటితో కడిగేయాలి.కొబ్బరి నూనెలో విటమిన్-ఇ పుష్కలంగా లభిస్తుంది. చర్మాన్ని తేమగా ఉంచడంలో, నలుపును వదిలించడంలో ఇది ముందుంటుంది. వారానికి రెండుమూడు సార్లయినా.. మోచేతులు, మోకాళ్లపై కొబ్బరి నూనెతో సున్నితంగా మర్దనా చేసుకోవాలి. రెగ్యులర్‌గా చేస్తే.. ఆయా భాగాల్లోని నలుపు తొలగిపోతుంది.బంగాళాదుంప ముక్కతో మోచేతులు, మోకాళ్లపై 5 నిమిషాల పాటు బాగా రుద్దుకోవాలి. ఆ తర్వాత నీటితో కడిగితే.. మంచి ఫలితం కనిపిస్తుంది.

## గొంతు నొప్పి, దగ్గు, గొంతులో గరగర సమస్యలకు..

# సహజసిద్ధమైన ఇంటి చిట్కాలు..!



గొంతు నొప్పి అనేది మనకు పలు కారణాల వల్ల వస్తుంది. సీజన్లు మారినప్పుడు లేదా వైరస్ ఇన్ఫెక్షన్ల కారణంగా, కఫం అధికంగా పేరుకుపోవడం, పడని ఆహారాలను తినడం వంటి కారణాల వల్ల గొంతు నొప్పి వస్తుంది. దీంతోపాటు గొంతులో గరగరగా, మంటగా కూడా ఉంటుంది. కొందరికి దగ్గు కూడా వస్తుంది. అయితే ఇలాంటి గొంతు సమస్యలు ఉంటే చాలా మంది టానిక్‌లను తెచ్చుకుని తాగుతారు లేదా మెడిసిన్‌ను వేసుకుంటారు. కానీ మన ఇంట్లో ఉండే పదార్థాలతోనే సహజసిద్ధంగా గొంతు సమస్యలను తగ్గించుకోవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. గొంతు నొప్పి లేదా ఇతర గొంతు సమస్యలను తగ్గించేందుకు ఉప్పు నీరు బాగా పనిచేస్తుంది. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త ఉప్పు వేసి కలిపి ఆ నీళ్లను గొంతులో పోసుకుని పుక్కిట పట్టాలి. ఇలా చేస్తుంటే సత్వరమే నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

**తేనె..:** గొంతు నొప్పిని తగ్గించడంలో తేనె కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. ఇందులో సహజసిద్ధమైన డిమల్సెంట్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు సమస్యలను తగ్గిస్తాయి. గొంతు నొప్పి నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. తేనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు సమస్యలను తగ్గిస్తాయి. తేనెను 1 లేదా 2 టీస్పూన్ల మోతాదులో రోజుకు 3 సార్లు సేవిస్తుండాలి. లేదా ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ తేనెను కలిపి రోజుకు 3 సార్లు తాగాలి. అల్లం టీలోనూ తేనె కలిపి తాగితే ఉపయోగం ఉంటుంది. గొంతు సమస్యల నుంచి సత్వరమే ఉపశమనం లభిస్తుంది. అయితే ఏడాది కన్నా తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు తేనెను ఇవ్వకూడదు.

**హెర్బల్ టీలు..:** గొంతు నొప్పి లేదా ఇతర గొంతు సమస్యలను తగ్గించేందుకు హెర్బల్ టీలు బాగా పనిచేస్తాయి. ఇవి గొంతులో ఉండే కఫాన్ని తొలగిస్తాయి.ఈ టీలలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలుఉంటాయి. ఈ టీలను సేవించడం వల్ల నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఒక పాత్రలో నీటిని తీసుకుని అందులో కొన్ని అల్లం ముక్కలను వేసి మరిగించాలి. అనంతరం వచ్చే నీళ్లను వడకట్టి అందులో కాస్త తేనె, నిమ్మరసం కలిపి తాగాలి. ఈ కషాయాన్ని రోజుకు 2 సార్లు తాగాల్సి ఉంటుంది. దీంతో గొంతు సమస్యలు తగ్గుముఖం పడతాయి. గొంతు సమస్యలకు అతి మధురం కూడా చక్కగాపనిచేస్తుంది. చిన్న అతి మధురం వేరు ముక్కను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతున్నా కూడాగొంతులో నొప్పి, మంట తగ్గిపోతాయి. ముక్కు దిబ్బడ నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. **పుదీనా ఆకులు..:** పుదీనా ఆకులను నీటిలో వేసి మరిగించాలి. అనంతరం వచ్చే నీటిని వడకట్టి తాగాలి. పుదీనా ఆకుల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు గొంతు నొప్పి, మంట, దగ్గు వంటి సమస్యలను తగ్గిస్తాయి. పాలలో పసుపు కలిపి తాగుతున్నా కూడా ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ మిశ్రమాన్ని రోజుకు 2 సార్లు తాగాల్సి ఉంటుంది. మెంతులను నీటిలో వేసి మరిగించి అనంతరం వచ్చే నీళ్లను వడకట్టి అందులో కాస్త తేనె కలిపి తాగుతుండాలి. రోజుకు దీన్ని 3 సార్ల వరకు తాగ వచ్చు. గొంతు సమస్యలను తగ్గించడంలో యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో 1 టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను కలిపి రోజుకు 2 సార్లు తాగుతుంటే ఫలితం ఉంటుంది. ఇలా ఈ సహజసిద్ధమైన చిట్కాలను ఉపయోగించి గొంతు నొప్పి, ఇతర గొంతు సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

# దానిమ్మ పండ్లను తిన్న తరువాత తొక్కను పడేయకండి..

## వాటితో కలిగే లాభాలు తెలిస్తే షాకవుతారు..!




దానిమ్మ పండ్లు చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా ఎరుపు రంగులో దర్శనమిస్తుంటాయి. ఈ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. దానిమ్మ పండ్లను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. కొందరు జ్యూస్ తాగేందుకు ఇష్టం చూపిస్తారు. దానిమ్మ పండ్లను తినడం వల్ల మనకు అద్భుతమైన లాభాలు కలుగుతాయి. పలు వ్యాధులను నయం చేసే శక్తి దానిమ్మ పండ్లకు ఉంటుంది. అయితే దానిమ్మ పండ్లు మాత్రమే కాదు, దాని తొక్క కూడా మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీన్ని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. లేదా తొక్కను ఎండబెట్టి పొడి చేసి దాన్ని కూడా ఉపయోగించుకోవచ్చు. ఇలా దానిమ్మ తొక్కను వాడితే ఎన్నో లాభాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దానిమ్మ తొక్కలతో పలు చిట్కాలను పాటించడం వల్ల వ్యాధులను నయం చేసుకోవచ్చని అంటున్నారు.

**వాపులు, నొప్పులకు..:** దానిమ్మ తొక్కలో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. దానిమ్మ గింజల కన్నా అధిక మొత్తంలో యాంటీ ఆక్సిడెంట్లు దాని తొక్కలోనే ఉంటాయి. ముఖ్యంగా ఈ తొక్కలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించడంలో సహాయం చేస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా శరీరంలో అంతర్గత వాపులు తగ్గిపోతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. నాడీ సంబంధ వ్యవస్థ సైతం ఆరోగ్యంగా ఉంటుంది.దానిమ్మ పండు తొక్కలోబయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. శరీరంలో ఉండే వాపులను తగ్గిస్తాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. శరీరంలోని నొప్పులు తగ్గిపోతాయి.కండరాల నొప్పులనుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..:** దానిమ్మ పండు తొక్కలో యాస్ట్రింజెంట్ గుణాలు ఉంటాయి. ఈ తొక్కలో టానిన్స్ కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి పేగులు, జీర్ణాశయం గోడల మ్యూకస్ పొరను రక్షిస్తాయి. దీంతో విరేచనాల నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్ట, పేగుల్లో ఉండే సూక్ష్మ క్రిములు నశిస్తాయి. మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణశక్తిని మెరుగు పరుస్తుంది. దానిమ్మ పండు తొక్కలో ఉండే పాలిఫినాల్స్ మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**షుగర్ సమస్యకు..:** షుగర్ వ్యాధి ఉన్నవారు దానిమ్మ పండు తొక్కలను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు 2 సార్లు ఒక కప్పు మోతాదులో తాగుతుంటే షుగర్ లెవల్స్ నియంత్రణలోకి వస్తాయి. ఈ తొక్కలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ ను తగ్గించడంలో ముఖ్య పాత్రపోషిస్తాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు ఈ నీళ్లను సేవిస్తుంటే శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ తగ్గుతుంది. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. దానిమ్మ పండు తొక్కలో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల దీన్ని తీసుకుంటే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. ఇన్‌ఫెక్షన్లు, జ్వరం, దగ్గు, జలుబు వంటి బారిన పడిన వారు దానిమ్మ పండు తొక్క నీళ్లను తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. ఇలా దానిమ్మ పండు తొక్క వల్ల ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు.

# బ్రేక్‌ఫాస్ట్‌ను బ్రేక్ చేస్తున్నారా?



ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేస్తున్నారా? అయితే, మీ మానసిక ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉన్నదట. 'అల్పాహారం-మానసిక ఆరోగ్యం'పై చేసిన ఓ సర్వే.. ఈ విషయాలను వెల్లడిస్తున్నది. 'హాంకాంగ్ యూత్ ఎపిడెమియోలాజికల్ స్టడీ ఆఫ్ మెంటల్ హెల్త్' పరిశోధకులు ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందుకోసం 15 నుంచి 24 ఏళ్ల వయసుగల 3,154 మందిని ఎంపిక చేశారు. వీరి రోజూవారి ఆహార అలవాట్లను పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం ఏదో ఒకటి తిన్నవారితో పోలిస్తే.. అల్పాహారం దాటవేసినవారు ఎక్కువ ఉద్రేకంతో, ఆందోళనతో, నిరాశతో కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న వారిలో 85% మంది ప్రతిరోజూ లేదా అడపాదడపా ఏదో ఒక అల్పాహారం తీసుకున్నారు.

మిగిలిన 15% మంది బ్రేక్‌ఫాస్ట్‌ను పూర్తిగా దాటవేశారు. ఈ సందర్భంగా అల్పాహారం తీసుకోని వారిలో శ్రద్ధ తగ్గిపోవడం, స్వీయ నియంత్రణను కోల్పోవడం లాంటి సమస్యలను గుర్తించినట్లు అధ్యయనకారులు చెబుతున్నారు.

ఇక అల్పాహారం దాటవేసేవారు తక్కువ ఉత్పాదకత కలిగి ఉన్నారని, పేలవమైన పనితీరును కనబర్చినట్లు గుర్తించారు. ఉద్యోగాలలోనూ తక్కువ సామర్థ్యం కలిగి ఉన్నారని నివేదించారు. బ్రేక్‌ఫాస్ట్‌ను దాటవేయడం వల్ల మధ్యాహ్నం వరకే నిస్సత్తువ ఆవహిస్తుందనీ, దాంతో దేనిమీదా శ్రద్ధ పుట్టదని చెబుతున్నారు. అందుకే, ఏ రకమైన ఆహారం, ఎంత పరిమాణంలో తింటారనే విషయాలతో సంబంధం లేకుండా.. ఉదయంపూట ఏదో ఒకటి తినడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక అల్పాహారం వల్ల మానసిక ఆరోగ్య ప్రయోజనాలతోపాటు శారీరక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత.. మధ్యాహ్నంపూట తక్కువ కేలరీలు తీసుకుంటారు.

## రోజూ గుప్పెడు నలుపు రంగు కిస్మిస్‌లను ఎందుకంటే..?

# నీటిలో నానబెట్టి తినాలి..



కిస్మిస్‌లు.. వీటినే ఎండు ద్రాక్ష అని కూడా అంటారు. ద్రాక్షలను ఎండబెట్టి వీటిని తయారు చేస్తారు. కిస్మిస్‌లను ఎక్కువగా తీపి వంటకాల్లో వేస్తుంటారు. అయితే కిస్మిస్‌లలో అనేక రకాలు ఉంటాయి. వాటిల్లో నలుపు రంగు కిస్మిస్‌లు కూడా ఒకటి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. నలుపు రంగు కిస్మిస్‌లలో పోషకాలు అధికంగా ఉంటాయి. వీటిని తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు పొందవచ్చు. ఈ కిస్మిస్‌లను 100 గ్రాముల మోతాదులో తింటే సుమారుగా 300 క్యాలరీల శక్తి లభిస్తుంది. పిండి పదార్థాలు 80 గ్రాములు, ఫైబర్ 7 గ్రాములు, ప్రోటీన్లు 3 గ్రాములు లభిస్తాయి. కొవ్వులు అసలే ఉండవు. విటమిన్లు బి1, బి2, బి3, బి6, బి9లతోపాటు విటమిన్ సి అధికంగా లభిస్తుంది. అలాగే ఈ కిస్మిస్‌లలో ఐరన్, పొటాషియం, క్యాల్షియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, బోరాన్ వంటి పోషకా లు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ కిస్మిస్‌లను తింటే పోషకాలు లభిస్తాయి. పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు.

రక్తహీనత సమస్యకు..: నలుపు రంగు కిస్మిస్‌లలో ఐరన్ అధికంగా ఉంటుంది. అందువల్ల ఈ కిస్మిస్‌లను తింటే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. హిమోగ్లోబిన్ తయారవుతుంది. ఈ కిస్మిస్‌లలో ఉండే విటమిన్ సి వల్ల శరీరం ఐరన్‌ను మరింత మెరుగ్గా శోషించుకుంటుంది. అలాగే కాపర్ కూడా లభిస్తుంది. దీంతో ఎర్ర రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. రక్తం తయారవుతుంది. రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. నలుపు రంగు కిస్మిస్‌లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా సార్బిటాల్ అనే సమ్మేళనం ఉంటుంది.

ఇది లాక్సేటివ్‌గా పనిచేస్తుం ది. అందువల్ల ఈ కిస్మిస్‌లను తింటే పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీని వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది.

ఎముకల ఆరోగ్యానికి..: నలుపు రంగు కిస్మిస్‌లలో క్యాల్షియం, బోరాన్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల సాంద్రతను పెంచుతాయి. ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మనం తిన్న ఆహారంలో ఉండే క్యాల్షియంను శరీరం మరింత మెరుగ్గా శోషించుకుంటుంది. దీంతో ఎముకలు బలంగా తయారవుతాయి. వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరోసిస్ సమస్య రాకుండా అడ్డుకోవచ్చు. మెనోపాజ్ దాటిన మహిళల్లో ఎముకలు బలహీనంగా మారకుండా ఉంటాయి. నలుపు రంగు కిస్మిస్‌లలో పొటాషియం

అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో సోడియం స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. అలాగే ఈ కిస్మిస్‌లలో ఉండే రెస్వెరెట్రాల్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గేలా చేస్తాయి. దీంతో రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

రోగ నిరోధక వ్యవస్థకు..: నలుపు రంగు కిస్మిస్‌లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి కనుక వీటిని తింటే ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. ఈ కిస్మిస్‌లలో ఉండే పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్, ఆంథో సయనిన్స్ ఆక్సీకరణ ఒత్తిడిని, శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులను తగ్గిస్తాయి. దీంతో తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చు. ఈ కిస్మిస్‌లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి శరీర రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తాయి. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు తగ్గుతాయి.

ఇలా నలుపు రంగు కిస్మిస్‌లను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. కనుక వీటిని రోజూ నీటిలో నానబెట్టి తింటే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

# వాదన కావొద్దు వివాదం



ఆలుమగల మధ్య అలకలు అందమే! వాదోపవాదాలూ.. గిల్లికజ్జాలూ సర్వ సాధారణమే! ఇలా.. గొడవలకు దారితీయని అభిప్రాయబేధాలు మంచివేనట. అవి.. భార్యభర్తల నడుమ బంధాన్ని మరింత బలపరుస్తాయట. అయితే.. ఆ మనస్పర్థలను టీ కప్పులో తుఫానులా తేలిపోనివ్వాలి. నివురు గప్పిన నిప్పులా దాచేస్తే.. అసలుకే మోసం వస్తుంది. ఎంత అన్యోన్యంగా జీవిస్తున్నా.. దంపతులన్నాక ఏదో ఒక విషయంలో మాట పట్టింపులు వస్తుంటాయి. వాదోపవాదాలు, చిన్నచిన్న గొడవలు పడుతుంటారు. అయితే, కొందరు ఇలాంటి గొడవలను మొగ్గలోనే తుంచేసి అనుబంధాలను బలపర్చుకుంటారు. కొందరు మాత్రం.. పెద్దవిగా చేసి బంధాన్ని తెంచేసుకుంటారు. 'ది హెల్దీ మ్యారేజ్' డేటా ప్రకారం.. సగటున ప్రతి జంటా నెలకు రెండుమూడు సార్లు గొడవలు పడుతుంటాయట. వీటిలో చాలావరకు.. ముదరకుండా చూసుకుంటూ, అన్యోన్యంగా ఉంటున్నారు. అందుకే, భార్యభర్తల నడుమ తలెత్తే వివాదాలు పరిమితిలోనే ఉండాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. అప్పుడే.. అపార్థాలన్నీ తొలగిపోతాయని అంటున్నారు.

వాదనకూ, గొడవకూ మధ్య తేడాలను గుర్తించాలి. వాదనలో.. ఏదో ఒక నిర్దిష్ట సమస్యపైనే దృష్టిని కేంద్రీకరిస్తారు. దానిపైనే వాడీవేడీగా చర్చించుకుంటారు. ఒకరు చెప్పేది మరొకరు వింటారు. రాజీపడటం, క్షమాపణలు, వాదనలకు పరిష్కార ప్రయత్నాలూ కనిపిస్తాయి. అదే.. గొడవ పడేవారిలో ఒకరిపై ఒకరికి ప్రతికూల భావనలు ఏర్పడతాయి. అది ఇద్దరి మధ్యా దూరం పెంచుతుంది. మనసు విరిగిపోయేలా చేస్తుంది. చిన్నచిన్న అభిప్రాయభేదాల వల్ల భాగస్వామి ఇష్టాయిష్టాలు తెలుస్తాయి. అందుకు తగ్గట్టుగా నడుచుకునేందుకు అవకాశం దొరుకుతుంది. అంతేకాకుండా.. వాదనలతోనే ముగిస్తే, రాబోయే రోజుల్లో పెద్ద గొడవలు జరగకుండా ఉంటాయి. ఆరోగ్యకరమైన వాదనలు బంధాన్ని, సాన్నిహిత్యాన్ని మరింతగా పెంచుతాయి.

చిన్న మాటే.. పెద్దపెద్ద గొడవలకు నాంది పలుకుతుంది. కాబట్టి, భాగస్వామితో వాదించేటప్పుడు భాషను అదుపులో పెట్టుకోవాలి. లేకుంటే.. వాదన వివాదానికి దారితీస్తుంది. పరిస్థితి సంక్లిష్టంగా మారుతుందని గుర్తించుకోండి.

కొందరు పాత విషయాలను మనసులోనే పెట్టుకుంటారు. సందర్భం దొరికితే చాలు పాత సంగతులు తోడుతారు. వాటినే తమ అస్త్రాలుగా మలుచుకొని.. భాగస్వామిపై ఎదురుదాడికి దిగుతారు. దాంతో గొడవలు తీవ్రరూపం దాలుస్తాయి. కాబట్టి, మీ తాజా వాదన దేనిగురించో.. దానిపైనే నిలబడండి. పాత విషయాలను ఎట్టి పరిస్థితిలోనూ చిన్నచిన్న వివాదాల్లోకి లాగకండి.

# ప్రకృతి వైపరీత్యాలు




గత కొంతకాలంగా పలు రాష్ట్రాల్లో అనూహ్యంగా భారీ వర్షాలు పడి, జన జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గంటల వ్యవధిలోనే అత్యధిక వర్షపాతం నమోదై, ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. వాగులూ వరకలూ, నదీనదాలూ ఉప్పొంగి, తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, హర్యానా, జమ్ము కాశ్మీర్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో అధిక వర్షాలు నమోదయ్యాయి. పెద్దఎత్తున ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవించాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కాశ్మీర్‌లలో ఏటవాలు భూభాగాల్లోని నిర్మాణాలూ, నివాసాలూ చూస్తుండగానే జల ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఉత్తరాఖండ్‌లోని ధారావి పట్టణం చాలా భాగం ఉనికిలో లేకుండా పోయింది. జమ్ము కాశ్మీర్లో కొండ చరియలు విరిగిపడి, 32 మంది వరకూ వైష్ణోదేవి యాత్రికులు దుర్మరణం చెందారు. గడిచిన 40 రోజుల్లో దేశం మొత్తమ్మీద భారీ వర్షాలూ, వరదలు కారణంగా సుమారు వెయ్యి మంది ప్రాణాలు కోల్పోయారు. రహదారులు, వంతెనలు, భవనాలు, పంటలూ అస్తవ్యస్తమయ్యాయి. వేల కోట్ల ఆస్తినష్టం జరిగింది.

ప్రతి ఏటా వర్షాలూ వరదలూ రావడం సాధారణమే అయినప్పటికీ– వాతావరణంలో ఇంత అపసవ్యత, అస్తవ్యస్తత ఎందుకు సంభవిస్తోంది? కురిస్తే అధిక వర్షం, లేకుంటే ఉష్ణతాపం ఎందుకు సర్వ సాధారణ దృశ్యంగా మారిపోతోంది? ఇలాంటి అంశాలను శాస్త్రీయంగా కనుక్కొని, పరిష్కార మార్గాలను అన్వేషించాలి. అంతర్జాతీయ వాతావరణ నిపుణుల అధ్యయనం ప్రకారం %ా% పర్యావరణ రక్షణ వ్యవస్థలు కొన్ని దశాబ్దాలుగా దారుణంగా దెబ్బతిన్నాయి. దాని ఫలితమే వాతావరణంలో ఇంత అస్తవ్యస్తత. అంచనాకు అందని అతి, అనావృష్టుల వైపరీత్యం! దక్షిణాసియా దేశాలైన చైనా, భారత్, పాకిస్తాన్‌లో మునుపెన్నడూ లేని విధంగా ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయి. ఒకే ప్రాంతంలో క్లౌడ్ బరస్ట్ సంభవించి, అధిక వర్షపాతం నమోదవ్వడంబీ ఆకస్మిక వరదలు ముంచెత్తటం కనిపిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా మాన్సూన్ టర్ఫ్ (రుతుపవన పీడన రేఖ) నెమ్మదిగా దక్షిణ దిశగా కదలటమే దీనికి కారణమని వాతావరణ శాస్త్రవేత్తల పరిశీలన. తీవ్రంగా ఎండలు కాయడం, ఆ వెంటనే అధిక పీడనం ఏర్పడి భారీ వర్షపాతం సంభవించటం సాధారణ ప్రక్రియగా మారిపోయిందని చెబుతున్నారు. అడవుల నరికివేత, ఉష్ణోగ్రతల పెరుగుదల పర్యవసానంగా నియంత్రణలో లేని అస్థిరమైన వాతావరణం ఏర్పడుతుందని వివరిస్తున్నారు. పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరించటం, పరిరక్షించటం మాత్రమే ఈ సమస్య పరిష్కారానికి ఏకైక మార్గం. అభివృద్ధి, ఆధునీకరణ పేరిట అధిక లాభాలను గుంజుకోవటానికి అడవుల మీద, ప్రకృతి వనరుల మీదా కార్పొరేట్లు చాలా కాలంగా కన్నేశారు. వారికి అనుగుణంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పర్యావరణానికి హాని చేసే విధంగా అటు గిరి అడవులను, ఇటు మడ అడవులను పెట్టుబడిదారులకు అప్పగించే విధానాలను అవలంబిస్తున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో వందలాది విద్యుత్ ప్రాజెక్టులు, విలాస రిసార్టులూ నదీ ప్రవాహ మార్గాలపై నిర్మితమయ్యాయి. బాక్సైట్, లేటరైట్ తవ్వకాల పేరిట దట్టమైన అడవులను కార్పొరేట్ల పరం చేయటానికి పాలకులు చట్టాలకు పాతరేసి మరీ తలుపులు తెరుస్తున్నారు. అడవులను, నదులను, ప్రకృతి వనరులను చిన్నాభిన్నం చేసే విధ్వంసక విధానాలనే అభివృద్ధి నమూనాలుగా బొంకుతూ, అడ్డొచ్చిన రైతులపై, గిరిజనులపై, ప్రజాసంఘాలపై నిర్బంధకాండ సాగిస్తున్నారు. ప్రకృతిలోని చెట్టూ చేమా, నింగీ నేలా, ఏరూ నీరూ భూమ్మీద నివసించే అందరివీ. వాటిని ఏ కొందరికో విచక్షణా రహితంగా ధారాదత్తం చేస్తే సహజ రక్షిత వ్యవస్థలు నాశనమవుతాయి. ప్రకృతి వైపరీత్యాలు ముంచుకొస్తాయి.

కాబట్టి, పాలకులు ప్రజలను, ప్రకృతిని పరిగణనలోకి తీసుకొని, విధానాలను రూపొందించాలి. సమగ్రమైన పర్యావరణ పరిరక్షణ విధానాన్ని రూపొందించి, కచ్చితంగా అమలు చేయాలి. నివాసాలు నీట మునిగితే, ప్రజలు ప్రాణాలు కోల్పోతే– అదేదో దైవలీల అని, పాప ప్రక్షాళన అని ఉత్తరాఖండ్ మంత్రి ఒకరు క్రూర పరిహాసం చేశారు. కార్పొరేట్లు ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తుంటే–ఆ నిజాన్ని గ్రహించకుండా మతవాదులు ప్రజలను కర్మ సిద్ధాంతాల్లో ముంచెత్తుతారు. వీరిద్దరి బంధమే ప్రజలకు, పర్యావరణానికి పెను ప్రమాదమన్న నిజాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలి.



## బోడ కాకర సాగు చేస్తోన్న గిరిజన రైతు..

### ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు

**ఏన్కూర్, తెలంగాణ దిశ:** గిరిజన రైతులకు ప్రభుత్వం అందిస్తే ఏమైనా సాధించవచ్చు అని అంటున్నారు. మండల పరిధిలోని కేసుపల్లి గ్రామానికి చెందిన చత్రియ కృష్ణ, అందరూ సాగు చేసే పత్తి, మిర్చి, మొక్కజొన్న, సాగు కాకుండా మార్కెట్లో డిమాండ్ ఉన్న బోడ కాకర సాగును ఎకరం తో మొదలుపెట్టి నేడు అంచెలంచెలుగా స్వశక్తితో మూడు ఎకరాలు సాగు చేసి లాభసాటిగా నిలిచాడు. భార్యాభర్తలు ఇద్దరూ నిత్యం బోడ కాకర సాగును కంటికి రెప్పల చూసుకుంటూ పంట చేతికి వచ్చే వరకు వివిధ రకాల మందులను పిచికారి చేస్తూ మార్కెట్‌కు బోడ కాకరను సప్లై చేస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే బోడ కాకర సాగు రైతులు చాలా అరుదుగా సాగు చేస్తుంటారు. తాను ఎందుకు చేయకూడదు అనే ఆలోచనతో గిరిజన రైతు చత్రియ కృష్ణ ఎకరం సాగుతో మొదలుపెట్టి నేడు మూడు ఎకరాలు సాగు వరకు చేసి లాభసాటిగా నిలిచాడు. మార్కెట్లో కేజీ బోడ కాకర వంద రూపాయలు అమ్మకం జరిపి. లాభాల బాటలో నిలిచాడు. ఐదు నెలల పంట కాలంలో మూడు ఎకరాలు సాగు చేస్తే ఖర్చులు పోను సుమారు 8 నుంచి 9 లక్షల రూపాయల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ప్రభుత్వం గిరిజనఅభివృద్ధి శాఖద్వారా మాలాంటి రైతులకు ప్రోత్సహిస్తే ముందుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నామని రైతు చత్రియ కృష్ణ తెలిపారు. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో స్పందించి బోడ కాకర సాగు చేస్తున్న చత్రియ కృష్ణకు పోల్స్ పొలం చుట్టూ ఫెన్సింగ్ ఇతర సామాగ్రిని ప్రభుత్వం అందజేస్తే ఆర్థికంగా గిరిజన రైతుల పరిస్థితి మెరుగయ్యే అవకాశం ఉందని పలువురు రైతులు కోరుతున్నారు.

# బీహార్‌లో రెబల్స్ బెడద!

### – ప్రధాన పార్టీల్లో టెన్షన్..టెన్షన్



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు కౌంట్‌డౌన్ షురూ అయ్యింది. దీంతో ఎన్‌డిఎ, మహాఘట్ బంధన్ కూటములు సీట్ల సర్దుబాటు చేసుకునేందుకు శరవేగంగా సన్నాహాలు చేస్తున్నాయి. అయితే తమకు పార్టీ నిరాకరిస్తే రెబెల్‌గా పోటీ చేసేందుకు కొందరు, ఇండిపెండెట్లు బరిలోకి దిగేందుకు ఇంకొందరు సిద్ధమవుతున్నారు. త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ దాదాపు 20కి పైగా సీట్లలో రెబల్స్ బరిలోకి దిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీరు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేస్తారు. ఈ క్రమంలో ప్రధాన పార్టీల నాయకులు రెబల్స్‌గా బరిలోకి దిగితే ఏయే పార్టీకి ఎంత నష్టం? గత ఎన్నికల్లో ఎంతమంది రెబల్స్ గెలిచారు? వంటి విషయాలపై ఆసక్తికరంగా మారింది. ఈ సారి బీహార్‌లో దాదాపు 24 స్థానాల్లో రెబుల్స్ దిగే పరిస్థితి కన్పిస్తోంది. 2020లో 11 అసెంబ్లీ స్థానాల్లో గెలుపు, ఓటముల మధ్య ఉన్న తేడా 1,000 కంటే తక్కువ ఓట్లే. దీంతో రెబుల్స్ ప్రతీపార్టీకి ఆందోళనకరంగా మారారు.. పాట్నాలోని బార్ నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే జ్ఞానేంద్ర సింగ్ పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేసి వార్తల్లో నిలిచారు.

అక్కడ కరణ్ వీర్ సింగ్ యాదవ్ కూడా పోటీదారుల జాబితాలో ఉన్నారు. ఆయనకు పార్టీ టికెట్ లభించకపోతే, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశం ఉంది. అలాగే, గైఘాట్, చకై దుమ్రాన్, కర్హాగర్, అరా, మహువా, దానాపుర్, కుమ్రార్, దిఘా సహా అనేక స్థానాలకు బహుళ పోటీదారు లు ఉన్నారు. సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ప్రకటన తర్వాతే ఎంతమం ది తిరుగుబాటుదారులు ఎన్నికల్లో పోటీ చేస్తారో స్పష్టంగా తెలుస్తుంది.

'కార్యకర్తలకు ఎప్పుడూ మొండిచెయ్యే': అభ్యర్థులకు టికెట్ల కేటాయింపులో రాజకీయ పార్టీలకు పారదర్శకత లేదని రాజకీయ విశ్లేషకుడు ప్రవీణ్ బాగి తెలిపారు. టికెట్ కేటాయింపులో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను తరచుగా నిర్లక్ష్యం చేస్తారని,. అలాగే టికెట్ల కేటాయింపులో ధనబలం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పార్టీలు టికెట్లను అమ్ముతున్నట్టు కూడా ఆరోపణలు వస్తున్నాయన్నారు. అందుకే చాలా మంది సీనియర్ నాయకులు తమ పార్టీ టికెట్ నిరాకరించినప్పుడు రెబల్స్‌గా మారి ఎన్నికల బరిలోకి దిగుతారని పేర్కొన్నారు.

'టికెట్ ఆశతో ఇతర పార్టీల్లోకి జంప్': చాలా మంది నాయకులు టికెట్ ఆశతో ఇతర పార్టీలలో చేరుతారని, కానీ అది జరగనప్పుడు వారు తిరుగుబాటు చేస్తారని రాజకీయ నిపుణుడు సునీల్ పాండే అన్నారు. అదేవిధంగా కొన్నిసార్లు వేరే పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి టికెట్ లభించినప్పుడు, నాయకులు రెబల్‌గా మారి పోటీ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. "చాలా మంది ప్రముఖ నాయకులు తమకు లేదా వారి కుటుంబాలకు టికెట్ పొందాలనే ఆశతో ఒక పార్టీని విడిచిపెట్టి మరొక పార్టీలోకి చేరుతారు. ఎన్నికలకు ముందు ప్రతిసారీ ఇలా జరుగుతుంది. ఈసారి కూడా ఈ పరిస్థితులు కనిపిస్తున్నాయి." అని సునీల్ పాండే వెల్లడించారు.

ఈ సారి వారిలో కొందరికి టికెట్ కష్టమే!:


ప్రస్తుతం బీహార్‌లో 70 నుంచి 80 ఏళ్ల మధ్య వయసు గల 31 మందిఎమ్మెల్యేలు ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ఎమ్మెల్యేల్లో చాలా మందికి టికెట్లు దక్కకపోవచ్చు. దీంతో అనేక మంది నాయకులు తిరుగుబాటు వైఖరిని అవలంబించే అవకాశం ఉంది. ఈ క్రమంలో రెబల్స్, ఇండిపెండెంట్‌గా పోటీ చేసే అవకాశం ఉంది. గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థుల విజయాల శాతం చాలా తక్కువగా ఉంది. కొంత మందికి డిపాజిట్లు కూడా దక్కలేదు. కానీవీరు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే స్థానంలో ఉంటారు. అందుకే వీరు పార్టీలకు టెన్షన్, టెన్షన్‌గా మారారు.

# బీహార్ లో కింగ్ మేకర్ గా పీకే...




పాట్నా : ప్రశాంత్ కిషోర్. పేరుపొందిన రాజకీయ వ్యూహకర్త. మనదేశంలో రాజకీయాలను కూడా కార్పొరేట్ మయం చేసిన వ్యక్తి. పైగా ఎలాంటి రాజకీయాలు చేయాలో.. ఎలాంటి రాజకీయాలు చేస్తే ఓట్లు పడతాయో.. ఒక స్ట్రాటజీ మాదిరిగా అతను చెప్పేవాడు. మనదేశంలో ఉన్న మెజారిటీ రాజకీయ పార్టీలకు అతడు పని చేశాడు. అయితే ఎక్కువసార్లు అతడి ప్రణాళికలు విజయవంతమై.. అతడు పని చేసిన రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఏపీలో వైసిపి, టిడిపి, కేంద్రంలో బిజెపి, ఒకానొక సందర్భంలో భారత రాష్ట్ర సమితి, టిఎంసి.. ఇలా అనేక రాజకీయ పార్టీలు అతడి ప్రణాళికలను అమలు చేసి అధికారంలోకి వచ్చాయి. ఎవరికో సేవలు చేసి.. అధికారంలోకి తీసుకొచ్చే బదులు.. తనే ఒక రాజకీయ పార్టీని పెట్టాలని ప్రశాంత్ కిషోర్ అనుకున్నాడు. అనుకున్నది తడవుగా జన్ సూరజ్ పేరుతో పార్టీ ని ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఆ పార్టీ బీహార్ రాష్ట్రంలో పోటీ చేస్తోంది. ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో ప్రశాంత్ కిషోర్ పార్టీ బీహార్ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషించే అవకాశం కనిపిస్తోందని తెలిపింది.. అందువల్లే ప్రశాంత్ కిషోర్ వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తున్నారు. అధికార పార్టీని.. ప్రతిపక్ష పార్టీని తనదైన వ్యూహాలతో ఇబ్బంది పెడుతున్నారు. గతంలో ఈ పార్టీలతో పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో ప్రశాంత్ కిషోర్ తనదైన చాకచక్యాన్ని ప్రదర్శిస్తున్నారు.. ఏమాత్రం అవకాశం దొరికినా చాలు రెచ్చిపోతున్నారు. తను ఇప్పటికిప్పుడు అధికారంలోకి రాకపోయినా పర్వాలేదు గానీ.. బీహార్ రాష్ట్ర అభివృద్ధిని మాత్రం విస్మరించేది లేదని ప్రశాంత్ కిషోర్ చెప్తున్నారు..రాజకీయ వ్యూహ కర్తగా పేరుపొందిన ప్రశాంత్ కిషోర్ పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తాను ఎదుర్కొన్న రాజకీయపరమైన విషయాలను మొహమాటం లేకుండా చెబుతున్నారు. 2021 నుంచి ఇప్పటివరకు కన్సల్టెన్సీ సేవల ద్వారా తాను 241 కోట్లు సంపాదించాలని ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు. వీటిలో 30.95 కోట్లు జీఎస్టీ రూపంలో.. 20 కోట్లు ఐటి రూపంలో చెల్లించినట్టు పేర్కొన్నారు. 98.75 కోట్లను పార్టీకి డొనేషన్ రూపంలో ఇచ్చినట్టు వెల్లడించారు. తన నైపుణ్యాన్ని అనుభవాన్ని ఉపయోగించి రెండు గంటలకు 11 కోట్లు తీసుకున్నట్టు ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు.. " రాజకీయాలు , వ్యాపారం వేరువేరు కాదు. ఒక వ్యాపారి ముందస్తు లాభాలను గురించి పెట్టుబడి పెడుతుంటాడు. జనాల అవసరాలకు తగ్గట్టుగా నడుచుకుంటాడు. రాజకీయ పార్టీలు కూడా అంతే. జనాల అవసరాల ఆధారంగా హామీలు ఇస్తుంటాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయడంలో షరతులు విధిస్తుంటాయి. ఎన్నికల్లో చేసిన ఖర్చుకు మించి సంపాదిస్తుంటాయి. అయితే ఇందులో వ్యూహాత్మకతను పాటించే రాజకీయ పార్టీకి మాత్రమే అధికారం దక్కుతుందని" ప్రశాంత్ కిషోర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

# చలాన్లు పెండింగ్ ఉంటే వెహికిల్ సీజ్



న్యూఢిల్లీ, : రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. ఎన్ని కఠిన నిబంధనలు విధించినా ప్రమాదాలు తగ్గడం లేదు. వివిధ కారణాలతో వాహనదారులు రూల్స్ అతిక్రమి స్తున్నారు. జరిమానా విధించినా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో జరిమానా వసూలుతోపాటు వాహనదారుల్లో మార్పు కోసం మరికొన్ని కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. మోటారు వెహికిల్స్ రూల్స్?1989లో కేంద్రం ప్రతిపాదించిన సవరణలు రవాణా నియంత్రణలో కొత్త పద్ధతులను తీసుకురావడం లక్ష్యంగా ఉన్నాయి. ఇప్పటి వరకు చలాన్ చెల్లించడానికి ఇచ్చిన 90 రోజుల గడువును 45 రోజులకు తగ్గించాలని నిర్ణయించారు. నిర్ణీత గడువులో చెల్లించని వాహనాలు సీజ్ చేసే అధికారం అధికారులకు లభించనుంది.కొత్త నిబంధనల ప్రకారం ఐదుకుపైగా ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదైతే డ్రైవింగ్ లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. తరచూ నిబంధనలు అతిక్రమించే డ్రైవర్లను నియంత్రించడానికి ఇది సమర్థమైన చర్యగా భావిస్తున్నారు.చలాన్ చెల్లింపులో ఆలస్యం జరిగితే, ఆ వాహనంపై ఏ రకమైన రిజిస్ట్రేషన్, బీమా లేదా విక్రయ లావాదేవీలు చేయడం సాధ్యంకాదని తాజా ముసాయిదా నిబంధనలు చెబుతున్నాయి.

# లోకల్ బాడీ ఎన్నికల్లో టీ'ఢీ' పీ

**ఖమ్మం,తెలంగాణ దిశ :** తెలంగాణలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అన్ని పార్టీలు సన్నాహాలు చేసుకుంటున్నాయి. అభ్యర్థులను బరిలో దించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రధానంగా అక్కడ అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అన్నట్టు ఉంది పరిస్థితి. అయితే ఆ మూడు పార్టీలకు ఇప్పుడు గెలుపు ముఖ్యం. అలా గెలవాలంటే గ్రౌండ్ లెవెల్ లో ఉన్న తెలుగుదేశం పార్టీ మద్దతు అవసరం. అసలు తెలుగుదేశం పార్టీ నాయకత్వం అభిప్రాయం ఏంటి? అనేది మాత్రం తెలియడం లేదు. మొన్న ఆమధ్యన హడావిడి చేసిన టిడిపి నాయక త్వం ఇప్పుడు వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తోంది. దీంతో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి పోటీ చేస్తుందా? లేకుంటే తప్పుకుం టుందా? లేకుంటే ఏ పార్టీకైనా మద్దతు తెలుపుతుందా? అన్నది మాత్రం తెలియడం లేదు. వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తే తప్పకుం డా అది కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చినట్టే.తెలంగాణలో తెలుగుదే శం పార్టీని దారుణంగా దెబ్బతీశారు కెసిఆర్. అందుకే అక్కడ టిడిపి శ్రేణులు గులాబీ పార్టీ వైపు వెళ్లే ఛాన్స్ లేదు. అయితే ఏపీలో బిజెపితో కలిసి ఉంది తెలుగుదేశం. ఎన్డీఏ లో కీలక భాగస్వామి. అయితే మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని కలుపు కెళ్లే ప్రయత్నం చేయలేదు బిజెపి. 2023 ఎన్నికల్లో సైతం జనసేనతో కలిసి వెళ్ళింది తప్ప టిడిపి తో కలిసి వెళ్లేందుకు ఇష్టపడలేదు. అందుకే బిజెపి పట్ల టిడిపి శ్రేణుల్లో ఒక రకమైన అసహనం ఉంది. కాంగ్రెస్ పార్టీకి నేరుగా మద్దతు తెలిపే ఛాన్స్ లేదు. అందుకే ఇప్పుడు టిడిపి ప్రకటన కోసం తెలంగాణ రాజకీయ పార్టీలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి నాయకులు లేరు. కానీ క్యాడర్ మాత్రం ఉంది. ఖమ్మం( లాంటి జిల్లాల్లో ఇప్పటికీ టిడిపి శ్రేణులు యాక్టివ్ గానే ఉన్నారు. 2023 ఎన్నికల నాటికి చంద్రబాబు జైల్లో ఉన్నారు. అందుకే అక్కడ తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. అయితే అప్పట్లో టిడిపి వ్యూహాత్మక మౌనం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీకి వరంగా మారింది. కాంగ్రెస్ విషయంలో టిడిపి శ్రేణులకు భిన్న వైఖరి ఉన్న.. రేవంత్ రూపంలో చంద్రబాబును చూసుకుంటారు అక్కడి టిడిపి క్యాడర్. అందుకే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలుగుదేశం పార్టీ పరోక్ష సహకారం అందించినట్టే. పోటీ చేయకపోవడంతో టీడీపీ శ్రేణులు కాంగ్రెస్ వైపు టర్న్ అయ్యాయి. అయితే మొన్న ఆ మధ్యన తెలంగాణలో టిడిపి భవన్ కు వచ్చారు నారా లోకేష్. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం అంటూ పిలుపునిచ్చారు. ఇప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా టిడిపి నాయకత్వం నుంచి కదలిక లేదు. అందుకే టిడిపి ప్రకటన కోసం తెలంగాణ రాజకీయ పార్టీలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. మరి టిడిపి హై కమాండ్ ఎలాంటి ఆదేశాలు ఇస్తుందో చూడాలి.

# జనంలోకి జనసేన

**విజయవాడ, తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్నజనసేన పార్టీ, సంస్థాగత బలోపేతంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ దిశగా పటిష్టమైన కార్యాచరణను రూపొందించారు. కేవలం ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటమే కాకుండా, పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి, రాబోయే ఐదేళ్లలో ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడానికి త్రిశూల వ్యూహం అమలు చేయాలని ఆయన తన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.జనసేన పార్టీ శాసనసభా పక్ష సమావేశం శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు పలువురు పార్టీ కీలక నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో పవన్ కల్యాణ్ కొన్ని కీలక అంశాలను పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడంలో భాగంగా, ప్రతి ఐదు నియోజకవర్గాలకు ఒక ఎమ్మెల్యేను ఇన్ ఛార్జ్ గా నియమించారు. ఈ ఇన్ ఛార్జ్‌లు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షించడం, స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేయడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో సహాయపడటం వంటి ముఖ్య బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. కేవలం జనసేన పార్టీ బలోపేతం గురించే కాకుండా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ఇచ్చిన హామీలు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా చూడటం, పారదర్శక పాలన అందించడంలో క్రియాశీలక పాత్ర పోషించడం దీని ఉద్దేశం. ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు తమ నియోజకవర్గాలకే పరిమితం కాకుండా, ప్రజల్లో విస్తృతంగా పర్యటించాలని పవన్ సూచించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడం ఈ పర్యటనల ముఖ్య లక్ష్యం.పార్టీ బలోపేతానికి పవన్ కల్యాణ్ త్రిశూల వ్యూహం రూపొందించారు. ఇది మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉంది. మొదటిది ప్రభుత్వపరమైన సమన్వయం. జనసేన నేతలు, కార్యకర్తలు క్షేత్ర స్థాయి సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకురావాలి. ప్రజలకు మెరుగైన సేవలు



అందించేలా కేడర్ పని చేయాలి. రెండోది సంస్థాగత పటిష్టత. నియోజకవర్గాల ఇన్ ఛార్జ్‌ల నియామకం ద్వారా పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం ఇందులో ఓ భాగం.

బూత్ స్థాయి కమిటీల వరకు క్రియాశీలకంగా ఉండేలా చూడాలని, యువతను, మహిళలను పార్టీలోకి ఆహ్వానించి, వారికి తగిన బాధ్యతలు అప్పగించాలని సూచించారు. మూడోది జనంలోకి జనసేన. పవన్ కల్యాణ్ స్వయంగా జిల్లాల్లో పర్యటించడం ద్వారా ప్రజల్లోకి చొచ్చుకుపోవాలనుకుం టున్నారు. గతంలో వారాహి విజయ యాత్ర స్ఫూర్తితో మరింత విస్తృతంగా ప్రజలతో మమేకం కావడం ఈ వ్యూహంలో భాగం.ప్రభుత్వంలో కీలక బాధ్యతలు, మరోవైపు సినిమా రంగంలో కమిట్‌మెంట్ల కారణంగా పవన్ కల్యాణ్ బిజీగా ఉంటున్నారు. ఇకపై కొంత సమయాన్ని జనం కోసం కేటాయించాలని నిర్ణయిం చుకున్నారు.

ఈ నెల నుంచే పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటనకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటనల్లో ఆయన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా, పార్టీ కార్యకర్తలతో, సామాన్య ప్రజలతో నేరుగా సమావేశం కానున్నారు.


తన బాధ్యతలను సమర్థవంతంగా సమన్వయం చేసుకుంటూ, పార్టీని బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దాలని పవన్ కల్యాణ్ గట్టి సంకల్పంతో ఉన్నట్లు తెలుస్తోంది.

## ఆ ఊరికి సర్పంచి.. ఆమెనే..!



**మిర్యాలగూడ, తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరిగితే ఆ ఊరికి ఆమె సర్పంచ్ కానుందా.. అవునని అంటున్నారు ఆ ఊరి గ్రామస్తులు. గతంలో ఓటమి చెందినప్పటికీ ప్రస్తుతం జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఆమె సర్పంచ్ కానుంది. నల్గొండ జిల్లా మాడుగుల పల్లి మండలం గజలాపురం గ్రామంలో 1024 మంది ఓటర్లు ఉండగా 492 మంది పురుషులు, 532 మంది మహిళలు ఉన్నారు. గ్రామంలో ఎనిమిది వార్డులు ఉన్నాయి. సర్పంచ్ ఎన్నిక ఎస్టీ మహిళకు రిజర్వ్ కావడంతో పాటు రెండు వార్డులు కూడా ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. గ్రామంలో ఒకే ఒక్క మహిళ (బ్రాహ్మల రోజా) ఎస్టీ ఓటు ఉండడంతో ఆమె సర్పంచిగా ఏకగ్రీవం కానుంది. గతంలో కూడా గజాల పురం ఎస్టీ జనరల్ గా రిజర్వేషన్ అయినప్పుడు రెండు కుటుంబాలు ఉన్నాయి. ఆ ఎన్నికల్లో రోజా పోటీ చేసి ఓటమి పాలైంది. కానీ ప్రస్తుతం గజలాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఆమె ఒక్కటే ఎస్టీ మహిళ ఓటు ఉండడంతో ఆమె త్వరలో జరగనున్న ఎన్నికల్లో సర్పంచ్ కానుంది. ఆ గ్రామంలోని రెండు వార్డులకు ఎస్టీ ఓటర్లు లేకపోవడంతో ఖాళీగా ఉండే పరిస్థితి ఉంది. దీంతో గ్రామంలోని అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు తమ మద్దతు ద్వారా సర్పంచిని ఎంపిక చేసేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నట్లు తెలిసింది. గ్రామంలోని ముఖ్య నేతలు మహిళా ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది.


# శబరిమలలో గోల్డ్ స్కామ్



తిరువనంతపుర,: శబరిమల ఆలయ ద్వారపాలకుల విగ్రహాలకు అమర్చిన బంగారు పూత తాపడాల బరువు తగ్గడం, ఆభరణాల నిర్వహణలో జరిగిన అక్రమాలపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కుంభకోణంలో అవినీతి పాల్పడింది కేవలం ఉన్నికృష్ణన్ పొట్టి మాత్రమే కాదని, దేవాలయ ఆస్తులను నిర్వహించే దేవస్వోం బోర్డు అధికారుల ప్రమేయం కూడా ఉందని కోర్టు వ్యాఖ్యానించింది.ఈ కేసు, శిక్షార్హమైన పలు నేరాలు జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని కోర్టు పేర్కొంది. ఈ కుంభకోణంపై దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది.స్వర్ణ కుంభకోణం'పై ఏర్పాటైన సిట్‌కు కేరళ పోలీస్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హెచ్ వెంకటేష్ నేతృత్వం వహిస్తారు. సిట్ ఈ కుంభకోణంపై అత్యంత నిజాయితీతో, గోప్యంగా దర్యాప్తు నిర్వహించాలని, అసలు దోషులను చట్టం ముందు నిలబెట్టా లని హైకోర్టు ఆదేశించింది. ఈ స్కామ్‌కు బలం చేకూర్చే కీలక అంశాన్ని విచారణ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. 2019 డిసెం బర్ 9న ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డు అధ్యక్షుడికి పంపిన ఒక ఈ-మెయిల్‌ను కోర్టు పరిశీలించింది.శబరిమల గర్భగుడి, ద్వారపాలకుల విగ్రహాల తాపడాలకు బంగారపు పూత పనులు పూర్తయిన తర్వాత తన దగ్గర అదనంగా పసిడి పలకలు మిగిలాయని పొట్టి ఆ ఈ మెయిల్‌లో పేర్కొన్నారు. ఆ అదనపు బంగారాన్ని ఒక పేద అమ్మాయి పెళ్లి కోసం వినియోగించడంపై దానిలో అభిప్రాయం కోరారు. దీన్ని చూస్తుంటే పొట్టి దగ్గర మిగులు బంగారం ఉన్నట్లు స్పష్టమవుతోందని, అందుకే ఈ అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు అవసరమని కోర్టు పేర్కొంది.

ఆలయ పవిత్రతను కాపాడేందుకు, దేవాలయ ఆస్తుల నిర్వహణలో పారదర్శకతను తీసుకువచ్చేందుకు సిట్ దర్యాప్తు కీలకంగా మారనుంది.అసెంబ్లీలో ఈ సంఘటనపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. ప్రతిపక్ష నాయకుడు ఎ ఆ సతీశన్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. "రాష్ట్ర ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు రెండూ దొంగతనం గురించి తెలిసినప్పటికీ దానిని అణచివేయాలని కుట్రలు చేశాయని ఆయన ఆరోపించారు.

# రెండు లక్షల్లో త్రీడి ఇళ్లు...



న్యూఢిల్లీ, : నేటి కాలంలో ఇల్లు కట్టుకోవడం అంటే గగనమే అని కొందరు భావిస్తుంటారు. ఎందుకంటే ఇల్లు నిర్మాణం కోసం ఉపయోగించే సామగ్రి ధరలు విపరీతంగా పెరిగాయి. అంతేకాకుండా భవన నిర్మాణ కార్మికుల వేతనాలు సైతం భారీగా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న ఇల్లు నిర్మించాలని అనుకున్నా కనీసం రూ. 10 లక్షలు కావాల్సిందే. అదికూడా అనుకున్న సమయానికి పూర్తవుతుందో..? లేదో..? అన్న ఆందోళన ఉంది. అయితే ఇప్పుడు ఆ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కేవలం రూ. 2 లక్షలకే 3ఆ ఇల్లు పూర్తి అవుతుంది. అది కూడా 45 రోజుల్లో గృహప్రవేశం కూడా చేసే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ త్రీడీ ఇళ్ల ప్రత్యేకత ఏంటి? దీనిని ఎలా నిర్మించుకోవాలి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం గురించి ఇల్లు నిర్మాణదారులకు తెలిసిన విషయమే. ఎందుకంటే కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారికి ఈ పథకం కింద కొంతవరకు ఆర్థిక సహాయం పొందవచ్చు. అయితే ప్రస్తుతం ఈ పథకం కింద పూర్తిగా ఇల్లును నిర్మిస్తున్నారు. కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో 3ట ఇలా నిర్మాణాలు చేపట్టారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూర్కీ లో లో ఇప్పటివరకు 130 ఇళ్ళను నిర్మించినట్లు కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఇటీవల మీడియా సంస్థలకు తెలిపాడు.తక్కువ ధరలో ఇల్లు నిర్మించాలని ఉద్దేశంతో త్రీడీ ఇళ్లను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ' పెహల్ 'అనే ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు కింద 250 ఇళ్ల డిజైన్ తయారు చేశారు. వీటిలో 3ట ప్రింటింగ్ టెక్నాలజీ ఇళ్లు బాగా ఆకర్షిస్తున్నాయి. ఈ ఇల్లు నిర్మాణంతో తక్కువ మొత్తం అవసరం ఉండడంతో పాటు మిగతా ఇళ్లతో పోలిస్తే ఇవి చాలా చల్లగా ఉండే అవకాశం ఉంది.3ట ప్రింటింగ్ టెక్నాలజీ ఇంటి నిర్మాణంలో ఎలాంటి కంకర వాడరు. కానీ స్లాబ్ కు మాత్రం ఇనుము వాడతారు. గోడలు పూర్తిగా ప్లేయాష్ ఇటుకలతో నిర్మిస్తారు. వీటి మధ్యన కాస్త సిమెంటును వాడతారు. మిగతా గోడలతో పోలిస్తే ఈ ఇటుకలకు తక్కువ సిమెంట్ అవసరం పడుతుంది. అయితే ఒక అంతస్తు నిర్మించుకునే వారు స్లాబ్ ను ఒకప్పటి పెంకుటిల్లులా నిర్మించుకోవచ్చు. అలాగే దీనిపై మరో రెండు అంతస్తులు వేసి కూడా ఇంటి నిర్మాణం చేసుకోవచ్చు. అయితే వీటిని నిర్మాణానికి పిల్లర్లు అవసరం లేదు. అవి లేకుండా కూడా ఇంటి నిర్మాణం గట్టిగానే ఉంటుంది. ఇక వేసవికాలంలో మిగతా ఇళ్లతో పోలిస్తే ఈ ఇల్లు చాలా చల్లగా ఉంటుంది. బయట ఉండే ఉష్ణోగ్రత కంటే 10 సెంటీ గ్రేడ్లు ఇందులో తక్కువగా నమోదు అవుతుంది. మొత్తంగా ఈ ఇంటి నిర్మాణానికి రూ. 2 లక్షలు ఖర్చు అవుతుంది.. అంతేకాకుండా 45 రోజుల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేస్తారు.


# స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనికాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్ట్రాంగ్ రూము, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర పరిశీలించారు. కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎంపిటిసి, జడ్పిటిసి మరియు సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూములు మరియు ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూములు భద్రత, సీసీ కెమెరా, పోలీస్ బందోబస్తు మరియు ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంపై ఆయన ఆరా తీశారు. ఎన్నికల సమయంలో ఎటువంటి లోపాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, లెక్కింపు రూముల్లో విద్యుత్, లైటింగ్, భద్రత వంటి అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపిడివోలు అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలు కల్పనపై



ధ్రువీకరణ ఇవ్వాలనిస్పష్టం చేశారు. దివ్యాన్గులకు ర్యాంపు, మూడు చక్రాల సైకిళ్ళు అందుబాటులో శిశు సంక్షేమఅధికారి మల్లీశ్వరి నోడల్ అధికారిగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎంపిడిఓ బాబు, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# దగ్గు సిరప్ మరణాల దృష్ట్యా తల్లిదండ్రులకు కొన్ని సూచనలు



తిరువనంతపురం: పిల్లల ఆరోగ్యానికి హాని కలిగించే స్వీయ మందులను నివారించాలని ఆరోగ్య నిపుణులు తల్లిదండ్రులను కోరారు. పిల్లల బరువు మరియు ఆరోగ్యాన్ని బట్టి వైద్యులు మందులు సూచిస్తారు. పాత ప్రిస్క్రిప్షన్ ప్రకారం లేదా మెడికల్ స్టోర్ నుండి నేరుగా కొనుగోలు చేసిన మందులు ఇవ్వడం పిల్లల ఆరోగ్యానికి హానికరమని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (కేరళ) తెలిపింది. మధ్యప్రదేశ్‌లో పిల్లల మరణానికి దారితీసిన కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్ అమ్మకాన్ని నిలిపివేసిన సందర్భంలో ఈ హెచ్చరికలు జారీచేసింది. అధిక మోతాదు తీసుకునే పిల్లలు మగత, అధిక అలసట మరియు వాంతులు వంటి సమస్యలను ఎదుర్కొంటారని పేర్కొంది. రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు దగ్గు ఉంటే.. తరచుగా తగినంత నీరు, ఆహారం మరియు సరైనవిశ్రాంతి తీసుకుంటే మందులు లేకుండానే తగ్గుతుందని సూచించారు. రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు వైద్యులు దగ్గు, జలుబు కాంబినేషన్ మందులను సూచించకూడదని పేర్కొన్నారు. పెద్ద పిల్లలకు సరైన మోతాదు ఇవ్వాలని, వైద్యుడు సూచించిన విధంగా తక్కువ సమయం పాటు ఇవ్వాలని కోరారు. ఉబ్బసంవంటి పరిస్థితుల వల్ల వచ్చే దగ్గుకు ఇన్హేలర్ ఉత్తమం.ఆరు నెలల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలలో అలెర్జీ రినిటిస్ వంటి నిర్దిష్ట పరిస్థితులకు కొన్ని యాంటిహిస్టామైన్‌లను పరిగణించవచ్చు.

# దగ్గు పానీయం కోల్డ్ రిఫ్ సిరఫ్ వినియోగించడం వెంటనే నిలిపివేయండి



**మంచిర్యాల,తెలంగాణ దిశ :**జిల్లాలో చిన్నపిల్లలలో దగ్గును నియంత్రించేందుకు వినియోగించే కోల్డ్ రిఫ్ సిరప్ వాడకాన్ని వెంటనే నిలిపివేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా, అనిత ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డి.జి. హెచ్.ఎస్.తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ మార్గదర్శకాల ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వెంటనే ఆపాలని సిరప్ సంబంధిత నిల్వాలుజిల్లాలో అందుబాటులో లేవని జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు ఫార్మాసిస్టులు ఏజెన్సీలు తమ వద్ద సిరప్ నిల్వాలు ఉన్నట్లయితే

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా, అనిత

వెంటే సమాచారం అందించాలని తెలిపారు. తమిళనాడులోని కాంచీపురం జిల్లాకు చెందిన శ్రేసన్ ఫార్మా మే 2025 నెలలో తయారు చేసిన బ్యాచ్ నం.ఎస్ఆర్ 13 నుండి వచ్చిన కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వలన చిన్న పిల్లలలో అనారోగ్య సమస్యలు రావడంతో ఈ మందు నిషేధించడం జరిగిందని మధ్యప్రదేష్ రాజస్థాన్ రాష్ట్రాలలో అనేక మంది పిల్లల మరణానికి కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగంతో సంబంధం ఉండటంతో ఈ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ప్రకారం నమోదు చేసుకున్న అన్ని ఆసుపత్రులు ఫార్మసీ కేంద్రాలు చిన్నపిల్లల వైద్యులు ప్రైవేట్ వైద్యుల వద్ద కోల్డ్ రిఫ్ సిరప్ లు ఉండరాదని సిరప్ నిల్వాలు కలిగి ఉన్న వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో టోల్ ఫ్రీ నం. 1800 599 6969 లో వివరాలు అందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రభావిత బ్యాచ్ సిరప్ నిల్వాలను గుర్తించి నిలిపివేయడానికి ఫార్మసీలు హోల్ సేల్ వ్యాపారులు ఆసుపత్రులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ పరిధిలోని గ్రామాలలో ఉన్న ఫార్మసీల వద్ద ఉన్న సిరప్ ల వివరాలు తీసుకోవాలని తెలిపారు. 2 సంవత్సరాల వయసు లోపు గల పిల్లలకు ఎలాంటి దగ్గు మందుల వినియోగానికి వైద్యులు సూచించరాదని తల్లిదండ్రులు పిల్లల వైద్య నిపుణుల సూచన ద్వారా మాత్రమే మందులను వినియోగించాలని ఫార్మాసిస్టులు డ్రగ్గిస్ట్ లు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించరాదని తెలిపారు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



## అక్రమ మద్యంపై ఎక్సైజ్ శాఖ నిఘా

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 9 నుండి నామినేషన్లు స్వీకరిస్తారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అక్రమ మద్యం రవాణాను అడ్డుకునేందుకు తెలంగాణ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అప్రమత్తమైంది. సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమ మద్యం రాకుండా ప్రత్యేక నిఘా పెట్టింది. మద్యం దుకాణదారులకు నియమావళిపై అవగాహన కల్పిస్తూ, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నగరా మోగింది. మొత్తం ఐదు దశల్లో ఎంపీటీసీ, సర్పంచ్, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ రెడీ అయ్యింది. ఈ నెల అనగా అక్టోబర్ 9వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నగదు, మద్యం రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు, అబ్కారీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అబ్కారీ శాఖ కీలక ప్రకటన చేసింది.. తెలంగాణలో సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో అబ్కారీ శాఖ అలర్ట్ అయ్యింది. రాష్ట్రంలో అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలు రచిస్తున్నారు. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల నుండి తెలంగాణలో అక్రమం గా మద్యం ప్రవేశించకుండా చూడటం కోసం సరిహద్దుల్లో ఉన్న అన్ని తపాలా, పోలీస్, ఎక్సైజ్ స్టేషన్లను అలర్ట్ చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలోఉన్న 34 ఎక్సైజ్ జిల్లాల పరిధిలోని.. 139 పోలీస్ స్టేషన్లలో గుడుంబా తయారీ, అమ్మకం, సరఫరా మీద ప్రత్యేక నిఘా పెట్టారు. దీంతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ కు నల్లబెల్లం మద్యం, ఇతర అక్రమ మద్యం రాకుండా తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి అక్రమ మద్యం రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# కళ్లను ప్రేమిద్దాం




"సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు. కళ్లు మన ముఖానికి ఆభరణాలు. కళ్ల అందాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించని కవులు వుండరంటే అతిశయోక్తి కాదేమో. 'మెరిసే తారలదే రూపం / విరిసే పువ్వులదే రూపం/ అది నా కంటికి శూన్యం/ మనసున కొలువై/ మమతల నెలవై వెలసిన దేవిది ఏ రూపం/ అది నా కంటికి శూన్యం' అంటారు 'సిరివెన్నెల'. ప్రకృతి, పువ్వులు, తారలు, ప్రేయసీ%˜% ఇవేకాదు.. మనిషికి నచ్చేవి, మనసు మెచ్చేవి కంటి నిండా దర్శించి, మది నిండా నింపుకోవాలంటే, వాటిని చూడగలిగే దృష్టి వుండాలి. ఆ కళ్లు ఆరోగ్యంగా వుండాలి. కళ్లు ఎంత ఆరోగ్యంగా వుంటే, ఆ మనిషి అంతే ఆరోగ్యంగా వుంటారు. అందుకే వాటిని కాపాడుకోవడం మన విధి. చాలా మంది కళ్ల విషయంలో అజాగ్రత్తగా వుంటారు. కళ్లు తెరిచిన దగ్గర నుంచి తిరిగి మూసేవరకు మనకు నిత్యం కళ్లతోనే పని. మనకు గుండె ఎంత ముఖ్యమో. కళ్లు కూడా అంతే ముఖ్యమని గుర్తుంచుకోవాలి' అంటారు ఆప్తమాలజిస్ట్ సారా మాలింగ్. మనం బాగా పరిగెత్తినప్పుడు గుండె కొట్టుకునే వేగం కూడా పెరుగుతుంది. ఆ సమయంలో పరుగు ఆపి, కాస్త విరామం తీసుకుంటాం. కానీ, కళ్ల దగ్గరకొచ్చేసరికి ఇలాంటి సడలింపులేమీ వుండవు. ఎలాంటి విరామం లేకుండా పనిచేస్తూనే వుంటాయి. ప్రస్తుతం కళ్లపై మరింత భారం, ఒత్తిడి పెరిగింది. చదువుకునే పిల్లలు ప్రింట్ మాధ్యమాల నుంచి దృశ్య (స్క్రీన్) మాధ్యమాల వైపు మారిపోతున్నారు. ఈ ప్రభావం దృష్టి లోపానికి దారి తీస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 220 కోట్ల మంది ప్రజలు ఏదో ఒక రకమైన దృష్టి లోపంతో బాధపడుతున్నారని, 2040 వాటికి మన పిల్లల్లో 50 శాతం పైగా కళ్లద్దాలు ధరించాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ఒక అంచనా. ఆధునిక జీవనశైలి మనిషి చుట్టూ అల్లుకున్న సాలెగూడులా మారింది. కుటుంబం, కెరీర్, అభివృద్ధి వంటివి మనిషి జీవన శైలిని పూర్తిగా మార్చేశాయి. స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, టాబ్లెట్లు మన రోజువారీ జీవితాల్లో అంతర్భాగమయ్యాయి. ఉద్యోగాలు ఎక్కువగా డిజిటల్ మాధ్యమాలపై ఆధారపడటం, పిల్లల నుంచి పెద్దల వరకూ గంటల తరబడి స్క్రీన్ల ముందే గడపడం ఇప్పుడు కామన్ అయింది. దీని మూలంగా దృష్టి లోపాలు, కళ్లు పొడివారడం, మయోపియా వంటి కంటి సమస్యలు వృద్ధి చెందుతున్నాయి. ఆధునిక జీవనశైలితో ముడిపడిన పిల్లల్లో మయోపియా కేసులు ప్రపంచవ్యాప్తంగా రెట్టింపు అయినట్లు ఇటీవల ఓ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన హెచ్చరిస్తోంది.ప్రకృతితో మమేకంకావడం తగ్గడం, నిత్యం వర్క్ ఫ్రమ్ హోమ్, స్క్రీన్ టైమ్ పెరగడం, శారీరక చలనం తగ్గిపోవడం వంటి అంశాలు కంటి ఆరోగ్యాన్ని దెబ్బ తీయడమేగాక చిన్న వయసులోనే అంధత్వం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏడాది అక్టోబర్ రెండో గురువారం 'ప్రపంచ దృష్టి దినోత్సవం' జరుపుకుంటు న్నారు. కంటి ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత, అంధత్వాన్ని నివారించ డంపై అవగాహన కల్పించడంలోభాగంగా ఒక్కో ఏడాది ఒక్కో థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. గతేడాది 'మీ కళ్లను ప్రేమించండి' అన్న థీమ్ ప్రతి మనిషిలో కంటి ఆరోగ్యంపై మక్కువ పెంచాలని పిలుపునిచ్చింది. 'కళ్లు మనసుకు అద్దం లాంటివి' అంటారు షేక్స్పియర్, మన జీవితంలో 80 శాతం సమాచారాన్ని కళ్ల ద్వారానే గ్రహిస్తామట. ఎవరైనా చూపు కోల్పోయినప్పుడు, అది వారి జీవితంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తుంది. కళ్లను ప్రేమించడం అంటే, వాటిని జాగ్రత్తగా చూసుకోవడం, వాటికి అవసరమైణ రక్షణ ఇవ్వడం. పిల్లలైనా, పెద్దలైనా సాధ్యమైనంత వరకూ డిజిటల్ స్క్రీన్లకు దూరంగా వుండాలి. అంతేకాదు. ప్రతి ఏడాది కార్యాలయాల్లో 350 లక్షల కంటి గాయాలు సంభవిస్తున్నాయని అంచనా. అన్ని అంధత్వ కేసుల్లో.. 90 శాతం అంధత్వాన్ని ముందుగానే గుర్తిస్తే నివారించవచ్చు లేదా చికిత్స చేయవచ్చు. చిన్న సమస్యే కదా అని నిర్లక్ష్యం చేస్తే.. అది పెద్ద సమస్యగా మారే ప్రమాదం వుంది. ఇక్కడ అవగాహన కీలక పాత్ర పోషిస్తుంది. 'మీరు ఎక్కువగా మనిషి కంటే మెషీన్లకే సమయం కేటాయిసే.. క్రియేటివిటీని కోల్పోతారు' అంటారు యాపిల్ సంస్థ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్. ఉద్యోగపు ఒత్తిడిలో,డిజిటల్ స్క్రీన్లు, రేడియేషన్ల మధ్య ఆధునిక జీవనశైలికి తలొగ్గినా.. కంటిచూపును ఆరోగ్యంగా వుంచుకోవాలి. మన కళ్లను మనం ప్రేమించాలి. ఇది ప్రపంచ దృష్టి దినోత్సవ సందేశం.


# సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఎంత చెప్పినా తక్కువే. మెట్రో రన్ అవుతున్నా, ఎక్కడిక్కక్కడ ఫ్లైఓవర్లు ఉన్నప్పటికీ ట్రాఫిక్ చిక్కులు నగరవాసులకు తప్పడం లేదు. ముఖ్యంగా నార్త్ సిటీ వైపు పరిస్థితి మరింత హారిబుల్‌గా ఉంటుంది. అందుకే దీనికి పరిష్కారంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్యారడైజ్ కూడలి నుంచి సమీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ రోజురోజుకు చాలా వేగంగా విస్తరిస్తోంది. ఈ విస్తరణ కారణంగా శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. అందుకే దీని నుంచి ఉపశమనం కోసం మెట్రో విస్తరణకు ప్రణాళికలు రచించారు. కానీ అది ముందుకు కదలడం లేదు. అందుకే ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నార్త్‌సిటీపై ఎక్కువ ఫోకస్ చేశారు. ప్యారడైజ్ సర్కిలల్ నుంచి మేడ్చల్, సమీర్‌పేట వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఊహించని స్థాయిలో పెరిగింది. ఈ మార్గం కేలం నిత్యం ప్రయాణించే లోకల్ వాహనాలే కాకుండా, ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాణిజ్య వాహనాలకు కూడా ప్రధాన రహదారి. దీంతో సాధారణ ప్రయాణ సమయం అంచనాలకు మించి పెరుగుతోంది.ఈ మార్గంలోఉదయం, సాయంత్ర వేళల్లో ట్రావెల్ చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ట్రాఫిక్ జామ్‌లు, వర్షాలు పడితే సమస్యలు మరింత రెట్టింపు అవుతున్నాయి. వీటికి పరిష్కార మార్గంగానే ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కారిడార్ ద్వారా నగరంలోలని అంతర్గత ట్రాఫిక్‌ను, ప్రధాన మార్గ ట్రాఫిక్‌ను వేరు చేయవచ్చు. దీని వల్ల నిరంతరాయంగా, వేగవంతైన ప్రయాణాన్ని సాధించవచ్చు. రవాణా సామర్థ్యాన్ని పెంచడం, తద్వార ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయడానికే ప్యారడైజ్ నుంచి సమీర్‌పేట వరకు ఈ కారిడర్‌ను ప్రతిపాదించారు. సాధారణంగా ఒక పెద్ద నిర్మాణ ప్రాజెక్టును చేపట్టే ముందు, సంబంధిత ఇంజినీరింగ్ విభాగం లేదా కన్సల్టెన్సీ సంస్థలు ప్రాజెక్టు డిజైన్, నిర్మాణ వ్యయం, సాంకేతిక అంశాలు, పర్యావరణ ప్రభావం వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకొనిరెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిర్మాణ వ్యయం, నిర్మాణ సమయం, ఇంజినీరింగ్, ఆర్థికపరమైన వివరాలతో వీటిని రెడీ చేశారు.ప్రభుత్వ అనుమతి కోసం పంపించనున్నారు. ప్యారడైజ్ నుంచి సమీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం సవాళ్లతో కూడిన టాస్క్‌గా అధికారులు భావిస్తున్నారు. భూసేకరణ, ట్రాఫిక్ మళ్లింపు, మౌళిక వసతుల కల్పన అన్నింటిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయినా సరే ఇది పూర్తి అయితే గంటల ప్రయాణం నిమిషాల్లోకి మారుతుంది. అంతే కాకుండా మేడ్చల్, సమీర్‌పేట్‌తో పాటు ఆ దారి చుట్టూ ఉన్న ప్రాంతాల అభివృద్ధి వేగం పుంజుకుంటుంది. మెరుగైన కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఇంధనం ఆదా అవుతుంది. కాలుష్యం తగ్గుతుంది. ఇది పూర్తి అయితే కచ్చితంగా హైదరాబాద్‌కు మరో మణిహారం తోడైనట్టుగా అధికారులు చెబుతున్నారు.

# మాగుడు గడ్డితో ఉపాధి, ఆదాయం

**అనంతపురం, తెలంగాణ దిశ :**మాగుడు గడ్డి కొరతతో సతమతమైన ఇద్దరు రైతులు, ఉమామహేష్, నజీర్‌లు ప్రభుత్వ రాయితీతో మొక్కజొన్న ఆధారిత మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించారు. ఇది విజయవంతంగా నడుస్తూ, తమ అవసరాలు తీర్చడమే కాకుండా 20 మందికి ఉపాధి కల్పిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల నుండి భారీ డిమాండ్ ఉంది. ఈ కేంద్రం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందుతూ, కలెక్టర్ ప్రశంసలు అందుకున్నారు. ఇద్దరు రైతులు తమ పొట్టేళ్లకు మేతకు మాగుడు గడ్డి కోసం ఇబ్బందిపడ్డారు. ఇతర ప్రాంతాల్లో గడ్డి కోసం తిప్పలుపడ్డారు. అప్పుడు స్థానికంగానే ఉత్పత్తి చేయాలనే ఆలోచనతో, ప్రభుత్వ రాయితీతో యంత్రాలు కొని, మొక్కజొన్న ఆధారిత మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పుడు వారు దానిని విజయవంతంగా నడుపుతూ.. ఈ కేంద్రం ద్వారా కేవలం తమ అవసరాలు తీర్చుకోవడమే కాదు మరో 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వీరు కూడా ఉపాధి, ఆదాయం పొందుతున్నారు.మాగుడు గడ్డి కోసం మొక్కజొన్న పంటను కోతకు రాకముందే పాల కంకి దశలోనే రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. మొక్కజొన్న ఎకరా పంటను రూ.30 వేల నుంచి రూ.42 వేలకు తీసుకుంటారు. ఈ మొక్కజొన్న పంటను యంత్రాల సాయంతో నూర్పిడి చేస్తారు. అనంతరం దీనికి కొన్ని పోషకాలు కూడా కలుపుతారు.. దానిని మాగుడు గడ్డి బేల్స్‌గా మారుస్తారు. ఈ దీనిని పశువులు, పొటేళ్లకు దాణాగా వినియోగిస్తారు. ఈ మాగుడు గడ్డిని టన్ను రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు ధర పలుకుతుంది. విడపనకల్లు మండలం కరకముక్కలకు చెందిన ఉమామహేష్, పాల్తూరుకు చెందిన నజీర్ మాగుడు గడ్డి ప్రాధాన్యతను గుర్తించారు. వారు ఆరు యంత్రాలు, మూడు ట్రాక్టర్లు కొనుగోలు చేసి, ఏడాదిలో పది నెలలపాటు మాగుడు గడ్డిని ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.1.20 కోట్లు పెట్టుబడి పెట్టగా, రూ.45 లక్షలు రాయితీగా వచ్చింది. ప్రస్తుతం వారు నెలకు రూ.1.20 లక్షలు రుణ ఈఎంఐ చెల్లిస్తున్నారు. దీనితోపాటు, నెలకు రూ.1.5 లక్షలు నిర్వహణ ఖర్చుల కోసం వెచ్చిస్తున్నారు.ఈ మాగుడు గడ్డికి డిమాండ్ కూడా ఉంది.. హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి,
శ్రీకాళహస్తి, నెల్లూరు వంటి ప్రాంతాల్లోని రైతులు ఆర్డర్లు పెట్టి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీనిని పశువులు, జీవాల మేతకు ఉపయోగించుకుంటున్నారు. అంతేకాదు అనంతపురం జిల్లా కలెక్టర్ కూడా ఈ మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రం గురించి తెలిసి రైతులను అభినందించారు. తాము గతంలో పశువుల, జీవాల మేత విషయంలో ఇబ్బంది పడ్డామని.. ఈ సమస్యకు పరిష్కారంగా ఇలా మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రం ఈ మాగుడు గడ్డి ఒక బేల్ రెండు నెలలకుపైగా నిల్వ ఉంటుందని.. ఒకవేళ బేల్ విప్పితే వారం మాత్రమే వాడుకోవచ్చని తెలిపారు రైతులు. మొత్తం మీద ఇద్దరు రైతులకు వచ్చిన వినూత్న ఆలోచనతో వారు అవసరాలు తీరడంతో పాటుగా ఆదాయం కూడా వస్తోంది.. అలాగే మరికొందరికి ఈ కేంద్రం ద్వారా ఉపాధి కూడా కల్పిస్తున్నారు.

# జగ్గారెడ్డి స్ట్రాంగ్ డెసిషన్ వెనుక..



**మెదక్, తెలంగాణ దిశ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించి సంచలనానికి తెరతీశారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేళ్ల పాటు తెలంగాణలో కాంగ్రెస్ దే అధికారం అని ప్రకటిస్తున్న సమయంలో జగ్గారెడ్డి తాత్కాలిక రాజకీయ బ్రేక్ ఎందుకన్నది ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ కు వచ్చే ఎన్నికల్లో అధికారం దక్కదని జగ్గారెడ్డి భావిస్తున్నారా? లేక తాను పోటీ చేస్తే సంగారెడ్డి నుంచి గెలిచే అవకాశం ఉండదని ఆయనకు ఏమైనా నివేదికలు అందాయా? అన్న విషయాలు బయటకు చెప్పకపోయినా తాను పదేళ్ల పాటు పోటీకి దూరంగా ఉంటానని జగ్గారెడ్డి చెప్పడం నియోజకవర్గంలోనే కాకుండా పార్టీలో కూడా హాట్ టాపిక్ గా మారింది. తూర్పు జయప్రకాశ్ రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి ఇప్పటికి మూడు సార్లు ఎమ్మెల్యేగా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి గెలిచారు. తొలిసారి 2004లో నాటి టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన జగ్గారెడ్డి ఆ ఎన్నికల్లో గెలిచారు. తర్వాత టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారారు. పార్టీ మారినప్పటికీ 2009 లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జగ్గారెడ్డి విజయం సాధించారు. అయితే తర్వాత 2014 ఎన్నికల్లో మాత్రం రాష్ట్ర విభజన జరిగిన వెంటనే జరిగిన ఎన్నికల్లో సంగారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2018 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో మాత్రం జగ్గారెడ్డి సంగారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. పోటీ చేసి ఓటమి పాలు కావడంతో ఆయనకు ఏ పదవి దక్కలేదు. . అందుకే ఈసారి జగ్గారెడ్డి మనసు మార్చుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తన సతీమణి నిర్మల బరిలో ఉంటారని చెప్పారు. పదేళ్ల పాటు తాను పోటీకి దూరంగా ఉంటానని ఆయన కార్యకర్తలకే తెలిపారు. ఒకవేళ తాను పోటీ చేసి మరోసారి ఓటమి పాలయితే ఏ పదవి లేకుండా ఉండాల్సి వస్తుందనా? లేక కొత్త వారికి అవకాశం ఇచ్చిన ట్లవుతుందనా? అన్నది మాత్రం అర్థం కాకుండా ఉంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవచ్చన్న అంచనాకు ఆయన వచ్చారా? అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. అయితే పదేళ్లు గ్యాప్ తీసుకుని తిరిగి పోటీ చేస్తామనడం ఏరకమైన వ్యూహమన్నది క్యాడర్ కు కూడా అర్థం కాకుండా ఉంది. అయితే తన సతీమణి పోటీలో ఉంటుందని చెప్పడంతో కార్యకర్తలకు ఆయన టచ్ లోనే ఉంటూ పార్టీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకు న్నట్లుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. మొత్తం మీద జగ్గుభాయ్ నిర్ణయం వెనక మతలబు ఏమిటన్నది ఎవరికి అంతుపట్టని విధంగా ఉంది.

# నల్లగా మారుతున్న ఎర్రకోట..

## శాస్త్రవేత్తల అధ్యయనంలో ఆందోళనకర అంశాలు




- ఢిల్లీ ఎర్రకోట రంగు మార్పు
- కాలుష్యం కారణంగా నల్లగా మారుతున్న ఎర్రరాయి గోడలు
- 'బ్లాక్ క్రస్ట్స్' వల్లే సమస్య అని తేల్చిన అధ్యయనం
- వాహన, పారిశ్రామిక కాలుష్యమే ప్రధాన కారణం
- కట్టడం పటిష్ఠతకు ముప్పు అని నిపుణుల హెచ్చరిక

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీకి తలమానికంగా నిలిచే చారిత్రక ఎర్రకోట తన సహజ సౌందర్యాన్ని కోల్పోయే ప్రమాదంలో ఉంది. నగరంలోని తీవ్ర వాయు కాలుష్యం కారణంగా 17వ శతాబ్దపు ఈ అద్భుత కట్టడం తన ఎర్రటి రంగును కోల్పోయి నల్లగా మారుతోంది. భారత్–ఇటలీ శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ ఆందోళనకర విషయం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలోని విషపూరిత గాలి ఎర్రకోట రాతి గోడలను రసాయనికంగా దెబ్బతీస్తోందని ఈ పరిశోధన తేల్చి చెప్పింది. వాహనాల పొగ, పరిశ్రమలు, నిర్మాణ రంగం నుంచి వెలువడే ధూళి కణాలు గాలిలో కలిసి కోట గోడలపై పేరుకుపోతున్నాయి. దీనివల్ల 'బ్లాక్ క్రస్ట్స్' (నల్లటి గట్టి పొరలు) ఏర్పడుతున్నాయి. ఈ పొరలలో జిప్సం, క్వార్ట్జ్‌తో పాటు సీసం, రాగి, జింక్ వంటి ప్రమాదకరమైన భార లోహాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. 2021 నుంచి 2023 వరకు సాగిన ఈ అధ్యయన వివరాలను జూన్ 2025లో 'హెరిటేజ్' అనే అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించారు. ఈ నల్లటి పొరలు కేవలం కట్టడం రంగును మార్చడమే కాకుండా, దాని పటిష్టతను కూడా దెబ్బతీస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే, గోడలపై ఉన్న సున్నితమైన, అపురూపమైన శిల్పకళ శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రకోటకే కాకుండా ఢిల్లీలోని హుమాయున్ సమాధి వంటి ఇతర చారిత్రక కట్టడాలకు కూడా భవిష్యత్తులో ఇదే ముప్పు పొంచి ఉందని అధ్యయనం స్పష్టం చేసింది. అయితే, ఈ నష్టాన్ని నివారించడానికి కొన్ని పరిష్కార మార్గాలు ఉన్నాయని పరిశోధకులు సూచిస్తున్నారు. "ఈ నల్లటి పొరలు ఏర్పడటం ప్రారంభ దశలో ఉన్నప్పుడే వాటిని సురక్షితంగా తొలగించడం ద్వారా రాతికి జరిగే నష్టాన్ని తగ్గించవచ్చు. ప్రమాదం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తరచూ శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టడం, రాళ్లకు రక్షణ పూతలు వేయడం ద్వారా ఈ చారిత్రక సంపదను కాపాడుకోవచ్చు" అని అధ్యయనంలో పేర్కొన్నారు.

# సినిమా..


## చీరకట్టుతో చెమటలు పట్టిస్తున్న బేబమ్మ..



కన్నడ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న కృతి శెట్టి తొలిసారి.. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సన దర్శకుడిగా మారి తొలి ప్రయత్నంలో చేసిన 'ఉప్పెన' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఈసినిమాలో బేబమ్మ పాత్రలో నటించి తన అద్భుతమైననటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది కృతి శెట్టి. మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా, కృతి శెట్టి హీరోయిన్గా వచ్చిన ఈ సినిమా అతి తక్కువ సమయంలోనే 100కోట్ల క్లబ్లో చేరి సంచలనం సృష్టించింది. ఇద్దరికీ ఇది తొలి చిత్రమైనా.. తమ నటనతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్నారు. ఈ సినిమా తర్వాత నానితో శ్యామ్ సింగరాయ్, నాగచైతన్యతో బంగార్రాజు వంటి చిత్రాలు చేసి హ్యాట్రిక్ సొంతం చేసుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన మొదట్లోనే హ్యాట్రిక్ అందుకున్న హీరోయిన్గా కూడా రికార్డు సృష్టించింది కృతి శెట్టి. ఆ తర్వాత పలు సినిమాలలో అవకాశాలు లభించాయి. కానీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయింది. అందులో భాగంగానే వరుస పరాజయాలు తలుపు తట్టడంతో కొంతకాలం ఇండస్ట్రీకి కూడా దూరమైంది ఇప్పుడిప్పుడే మళ్లీ తనను తాను కం బ్యాక్ చేసుకోవాలని చూస్తున్న కృతి శెట్టి.. ఇటు సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులను అలరిస్తోంది. మొదట్లో పద్ధతిగా కనిపించి, ఆ తర్వాత గ్లామర్ డోస్ పెంచిన ఈమె తన అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈసారి ఏకంగా చీరకట్టుతోనే చూసే ఆడియన్స్ కు చెమటలు పట్టించేసింది కృతి శెట్టి. తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు ఇన్ని రోజులు ఇంత అందాన్ని ఎలా మిస్ అయ్యాం అంటూ కామెంట్లు చేస్తున్నారు

శారీ విషయానికి వస్తే.. ఎంబ్రాయిడరీ నెట్టెడ్ లైట్ ఆరెంజ్ కలర్ తో డిజైన్ చేసిన చీరను కట్టుకొని , అందుకు కాంబినేషన్లో స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించింది. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన బ్లౌజ్ లో తన ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా జుట్టును వదులుగా వదిలేసి సింపుల్ జువెలరీ తో తన మేకోవర్ ను ఫినిష్ చేసింది. ఇందులో నడుము, ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు, అటు ఫేస్ ఎక్స్ప్రెషన్స్ కి కుర్రకారు ఫిదా అయిపోతున్నారు. పైగా ఈ ఫోటోలకు దేశి గర్ల్ వైబ్స్ అంటూ క్యాప్షన్ కూడా జోడించింది.

## గ్యాంగ్‌లీడర్ కాంబో రిపీట్.. నానితో సుజిత్ క్రేజీ ప్లాన్..!






నాని టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం గ్యాంగ్ లీడర్. ఈ మూవీలో ప్రియాంకా అరుళ్‌మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. ఈ కోలీవుడ్ భామ గ్యాంగ్ లీడర్‌తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిక్స్ డ్ టాక్ తెచ్చుకోగా.. ప్రియాంకా అరుళ్‌మోహన్‌కు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. కాగా ఇప్పుడీ క్రేజీ కాంబినేషన్ మరోసారి రిపీట్ కానుందా..?

అంటే అవుననే అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు. నాని, ప్రియాంకా అరుళ్ మోహన్ మరోసారి కలిసి నటించబోతున్నారన్న వార్త ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఓజీ డైరెక్టర్ సుజిత్ డైరెక్షన్‌లో నాని హీరోగా సినిమా వస్తుందని తెలిసిందే. ఈ ప్రాజెక్టులో నాని, ప్రియాంకా అరుళ్ మోహన్ రెండోసారి సిల్వర్ స్క్రీన్‌పై మెరువబోతున్నారని ఓ క్రేజీ గాసిప్ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఇప్పటికే ప్రియాంకా అరుళ్ మోహన్ తో డిస్కషన్స్ పూర్తయ్యాయని.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావడమే తరువాయి అని నెట్టింట చర్చ నడుస్తోంది. నాని-సుజిత్ సినిమా ఇటీవలే గ్రాండ్‌గా లాంచ్ అయిన విషయం తెలిసిందే.

## రవితేజ- శ్రీలీల మాస్ హంగామా .."మాస్ జాతర"



మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా, అందాల ముద్దుగుమ్మ శ్రీలీల కథానాయికగా తెరకెక్కుతున్న హై ఆక్టేన్ మాస్ ఎంటర్టైనర్ "మాస్‌జాతర" సినిమా జోరుగా ప్రమోషన్ కార్యక్రమాలు జరుపుకుంటుంది. దర్శకుడు భాను బోగవరపు తెరకెక్కిస్తున్న ఈ అవైటెడ్ సినిమాపై ఇప్పటికే మంచి హైప్ నెలకొంది. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు ప్రేక్షకుల్ని మెప్పించాయి. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన ట్యూన్స్ యూత్‌లో బాగా కనెక్ట్ అయ్యాయి. తాజాగా మేకర్స్ ఓ మాస్ నంబర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. హుడియో హుడియో,, అని సాగే ఈ పాటను దేవ్ రాయగా భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకత్వంలో భీమ్స్, హేశం అబ్దుల్ వాహద్ పాడారు. రవితేజ - శ్రీలీలపై చిత్రీకరించిన ఈ ఎనర్జిటిక్ సాంగ్ ఆకట్టుకుంటుంది. పక్కా మాస్ కమర్షియల్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం అక్టోబర్ 31న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఫ్యామిలీ ఆడియెన్స్‌ను లక్ష్యంగా చేసుకుని సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేశారు.రవితేజ శ్రీలీల కాంబినేషన్, భీమ్స్ మ్యూజిక్, మాస్ టైటిల్ ఇవన్నీ కలిసొచ్చి "మాస్ జాతర" పై భారీ అంచనాలు పెంచుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టీజర్‌కి మంచి రెస్పాన్స్ రావడంతో ట్రేడ్ వర్గాల్లో కూడా సినిమా పట్ల హైప్స్ పెరిగాయి. మొత్తం మీద, మాస్ మహారాజ అభిమానులకు ఈ అక్టోబర్ నెలనిజంగా ఒక పెద్ద పండుగలా మారనుంది. "హుడి యో హుడియో" పాట ప్రోమోతో రవితేజ మాస్ ఎంటర్‌టైన్‌మెంట్‌కి ఇంకొంచెం వేడి పెరిగేలా ఉంది! అయితే ఈ మూవీ బాహుబలి చిత్రానికి పోటీగా విడుదల కానుండడంతో అభిమానులు కాస్త టెన్షన్ పెడుతున్నారు. మూవీ అటూ ఇటుగా ఉంటే మాత్రం రవితేజ సినిమాకి పెద్ద దెబ్బ పడుతుందని విశ్లేషకులు కూడా చెప్పుకొస్తున్నారు.



# విడుదల రోజే పైరసీ గ్రహణం..!?



టాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకూ.. కోలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ ఏ సినిమా పరిశ్రమను చూసినా 'పైరసీ' భూతం వెంటాడుతోంది. అధునాతన టెక్నాలజీ సంగతి పక్కన పెడితే మొబైల్ సెల్ నుంచి తీసిన పైరసీ వీడియోలు యావత్ సినిమా పరిశ్రమను హడలెత్తిస్తున్నాయి. ఈ ఏడాది పైరసీలో వచ్చిన కొత్త రూపం హెడ్‌డి ప్రింట్ కాపీలు ఆన్‌లైన్‌లో ఎంచక్కా చక్కర్లు కొట్టేస్తున్నాయి. సర్వర్ హ్యాకింగ్‌తో పాటు క్యామ్ కార్డర్ ద్వారా నిందితులు సినిమాలను పైరసీ చేస్తున్నారు. బెట్టింగ్ గేమింగ్ యాప్స్ నిర్వాహకులు పైరసీ చేసే వాళ్లకు డబ్బులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఆయా నిర్వాహకులు పైరసీ మూవీల ద్వారా తన యాప్‌లను ప్రచారం చేసుకుంటున్నారు. దేశంలోని మిగతా ఇండిస్ట్రీలతో పోల్చితే ఎక్కువ పైరసీ నడుస్తోంది టాలీవుడ్‌లోనే. రిలీజ్ అయిన మొదటిరోజై హై క్వాలిటీతో ఆన్‌లైన్‌లో మూవీస్ లింక్స్ వచ్చేస్తున్నాయి. సోషల్ మీడియాలో నిముషాల్లోనే వైరల్ అవుతుండటంతో అందరూ గుట్టుచప్పుడు కాకుండా ఎంచక్కా డౌన్‌లోడ్ చేసేసుకుని చూసేస్తున్నారు. గతంలో భయం భయంగా ఇళ్లల్లో చూసేవారు. ఇప్పుడు ప్రయాణాల్లో సైతం బ్లూటూత్ ఉపయోగిస్తూ వీక్షిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ విడుదలైన ప్రతి సినిమా అదేరోజూ పైరసీలో వచ్చేశాయంటే ఆశ్చర్యం కలుగకమానదు. ఇందులో హిట్టయిన సినిమాలు, పరాజయం పొంది నవి కూడా ఉన్నాయి. అయితే నష్టపోయింది మాత్రం నిర్మాతలు, పెట్టుబడి పెట్టిన వారు. పైరసీదారులు మాత్రం కోట్లు గడించిన ఉదంతాలు ఇటీవల కాలంలో చాలా వెలుగులోకి వచ్చాయి. క్రిప్టో కరెన్సీ ద్వారా లావాదేవీలు:

తాజాగా తెలంగాణా సైబర్ క్రైమ్ పోలీసుల చొరవతో దేశంలోనే అతి పెద్ద పైరసీ నెట్‌వర్క్ భాగోతం వెలుగులోకి వచ్చింది. నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయటంతో పాటుగా ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పైరసీ ముఠా సభ్యులు తెలుగు, హిందీ, తమిళం సహా అనేక భాషల సినిమాల ను రిలీజ్ అయిన రోజే థియేటర్లలో రికార్డు చేసి అమ్ముతున్నట్లు గుర్తించారు. క్రిప్టో కరెన్సీ ద్వారా లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు ఈ పైరసీ వల్ల ఇండిస్ట్రీకి దేశంలో ఏడాదికి దాదాపు రూ.22 వేల కోట్ల నష్టం జరిగినట్లుగా ధృవీకరించారు.

పైరసీ జరిగేది ఇలా: హైదరాబాద్‌కు చెందిన జానా కిరణ్‌కుమార్ అత్తాపూర్‌లోని మంత్ర థియేటర్‌లో సింగిల్ అనే మూవీని మొబైల్‌లో రికార్డుచేసి సిరిల్ అనే వ్యక్తికి అందజేశాడు. ఇలా 40 సినిమాలు థియేటర్‌లో కాపీ చేశాడు. 150 నుంచి 500 డాలర్లు ప్రతి మూవీ కాపీ చేసినందుకు పొందాడు. సూటబుల్ సీటు చూసుకుని టికెట్ బుక్ చేసుకుని హై అండ్ కెమెరా ఉన్న ఫోన్‌తో రికార్డు చేస్తారు. స్క్రీన్ ఆఫ్ ఉన్నా కెమెరాల్లో వీడియో రికార్డుచేసే యాప్ ద్వారా ఇదంతా చేస్తున్నారు. అర్సలన్ అహ్మద్ బీహార్‌కు చెందిన వ్యక్తి. ఇతను హిందీ జోజ్‌పురి సినిమాలు రికార్డు చేసి సిరల్‌కు పంపుతున్నాడు. నాలుగు వెబ్‌సైట్లు నడుపుతున్న కరూర్‌కు చెందిన సిరిల్ ప్రధాననిందితుడుగాతెలంగాణా పోలీసులవిచారణలో వెల్లడైం ది. కంప్యూటర్ సైన్స్ చదివిన అతడు ఈజీమనీ కోసం ఈ మార్గాన్ని ఎంచుకున్నాడని తేలింది.

ఏజెంట్లను నియమించుకుని అన్ని భాషల సినిమాలను ఇతడు పైరసీ చేయిస్తున్నాడు. ఈటీవీ విన్ కంటెంట్‌ను పైరసీ చేసి అమ్ముకున్న మరో నిందితుడిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. రికార్డు చేసిన కంటెంట్ ఇతర వెబ్‌సైట్లకు పైరసీ ముఠా విక్రయిస్తోంది. ఓటీటీ కంటెంట్లను ఐబొమ్మ సహా పలు ప్లాట్‌ఫామ్‌లకు అమ్ముతోంది. ఐబొమ్మ పాత్రపై పోలీసులు లోతైన దర్యాప్తు జరపగా ఆ వెబ్‌సైట్ కోసం పనిచేసే నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లో ఐబొమ్మకు ఏజెంట్లు ఉన్నారని తేలింది. కెమెరాలతో థియేటర్‌లో మూవీలను రికార్డు చేసి ప్రింట్స్ విడుదల చేస్తున్న వెబ్‌సైట్స్‌పై దృష్టి పెట్టాలని పోలీసులు భావిస్తున్నారు.

ఎలా షేర్ చేస్తారంటే: సామాజిక మాధ్యమాలు, మొబైల్ ద్వారా ఈ పైరసీ గ్యాంగ్ చాలా యాక్టింగ్ ఉంటోంది.

ముందస్తు పథకం ప్రకారం ముఠా సభ్యులు చాలా కాలంగా సినిమాలను సీక్రెట్‌గా థియేటర్లలో హిడెన్ కెమెరా ద్వారా రికార్డ్ చేసి వాటిని టెలిగ్రామ్, ప్రోటాన్ మెయిల్ వంటి ప్లాట్ ఫామ్స్‌లో అప్‌లోడ్ చేసేస్తారు. అక్కడి నుంచి గుట్టు చప్పుడు కాకుండా సామాజిక సైట్లు, మరికొందరు వ్యాపారులకు వెళ్తాయి.

ఏడాదిన్నరలో 40 సినిమాలు పైరసీ: గత 18 నెలల్లో పైరసీ ముఠా తమ నెట్వర్క్ ద్వారా 40కి పైగా తెలుగు సినిమాలను లీక్ చేశాయి. ఏదైనా సినిమా థియేటర్‌లో రిలీజ్ కాగానే అవి అక్రమ వెబ్‌సైట్లలోకి వచ్చేస్తున్నాయి. ఈ ముఠా అంతర్జాతీయ పైరసీ ప్లాట్ ఫాంలతో '1 తమిళ టివి' వంటి వెబ్‌సైట్లతో కూడా సంబంధం కల్గివుంది. వారి క్రిప్టో వాలెట్ ట్రాన్సాక్షన్స్‌ను ట్రాక్ చేసిన పోలీసులు లొకేషన్ గుర్తించారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ 'యాంటీ వీడియో పైరసీ సెల్'ను గత కొంతకాలంగా కొనసాగిస్తోంది. ఈ సెల్‌కు పలు సినీ నిర్మాతలు, దర్శకులు పైరసీ సినిమాల గురించి ఫిర్యాదులు సమర్పిస్తూనే ఉంటున్నారు. 'హ్యాష్ ట్యాగ్ సింగిల్' సినిమా పైరసీపైనా గతంలో పోలీసులకు ఫిర్యాదు అందింది. దీని ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. జులై 3న వనస్థలిపురానికి చెందిన కిరణ్‌ను అరెస్ట్ చేసి విచారించగా, ఈ ముఠా గుట్టు రట్టయ్యింది.

ఈ పైరసీ ముఠా దుబాయ్, నెదర్లాండ్, మయన్మార్‌లో ఉన్నట్లు గుర్తించారు. థియేటర్లలో ప్లే అయ్యే శాటిలైట్ కంటెంట్ ఐడీ, పాస్‌వర్డ్‌లను క్రాక్ చేసి%8%% ఏజెంట్లకు రికార్డ్ కెమెరాలు అందజేసి రహస్యంగా ఎలా రికార్డ్ చేయాలో ఈ పైరసీ ముఠా నేర్పిస్తుంది. చొక్కా జేబులు, పాప్‌కార్న్ డబ్బా, కోక్ టిన్లలో కెమెరాలు పెట్టి మూవీ షూట్ చేస్తున్నారు.

కొత్త సినిమా కూడా మొబైల్‌లో అందుబాట్లోకి రావడంతో చాలామంది థియేటర్లకు వెళ్లటం లేదు. దీనివల్ల నిర్మాతల ఆదాయానికి గండి పడుతోంది. 2023లో దేశంలో సినీ పరిశ్రమ పైరసీతో రూ.22,400 కోట్లు, అందులో తెలుగు ఇండిస్ట్రీ రూ.3700 కోట్లు నష్టపోయినట్టు చెబుతున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215